విజ్ఞాన రోగి
దోపిడి రాచభోగి
కాలేదు త్యాగి

గొడుగు నీడ
ఎండవానకు తోడు
ప్రాణహితుడు.

నమ్మలేని నిజాలు

సినారె పాట
కృష్ణమ్మ పరవళ్లు
పౌర్ణమి శశి.

జెన్ జీల తరం
మార్పుకు ఓ సంకేతం
పదా ముందుకు.

నిషా విముక్తం
వికసిత భారతం
యువత మార్గం.



- రేడియమ్
సెల్: 9291527757

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

ప్రధానీ మోదీ ఇదేం ?
ఓట్ల చోరి బాబోయ్ !
అధికారాల ఎన్నికల
కమీషనే రోబోయ్ !
మీ గద్దె దింపటానికి
ఒకే ఒక్క దిక్కు !
రాజ్యాంగం ఇచ్చిందోయ్
ఓటు వేసె హక్కు !



- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

హైదరాబాద్ గురువారం 1-10-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :33 సంచిక:52 పేజీలు:6 వెల: రూ.1/-


# గాంధీజీ...మహాత్ముడే...!



Generations to come will scarce believe that such a one as this ever in flesh and blood walked upon this earth " - Albert Einstein.

సత్యాన్వేషణతో భగీరథుని మించిన వారు మోహన్ దాస్ కరం చంద్ గాంధీ అని ఆనాటి స్వతంత్ర పోరాటకాలంలో నివసించిన ప్రతి ఒక్కరికీ తెలుసునని వేరే చెప్పనక్క రలేదు. అందుకే ఒక ప్రముఖుడు ఇలా అన్నాడు... Gandhiji was no armchair phylo sopher, but one who put into practice the essence of teachings of great minds... గాంధీజీ తొలిరోజుల్లో 'భగవంతుడే సత్యం' అనేవారు. తరువాత కాలంలో 'సత్యమే భగవంతుడు' అనే వాస్తవాన్ని ప్రబోధించారు. ఆ తరువాతనే my experiments with truth' అన్న ఆత్మకథను రాసుకొన్నారు. సత్యం అన్నది ఒక చిన్న పదం కాదు, అది జీవితానికి దారి దీపం, ఆధ్యాత్మికతకు ఆత్మ స్వరూపం అన్నారు గాంధీజీ. వారి విగ్రహం లేని దేశం, వారి బోధనలకు స్పంధించని దేశం ప్రపంచంలోలేదు. ఏ ప్రసారసాధనాలూ లేని కాలంలోనే ఒక్క పిలుపులో కోట్లాదిమంది ప్రజలను ఒక తాటిపై నిలబెట్టిన ఘనత అతి కొద్ది మందికే చెల్లింది చరిత్రలో, వారిలో ప్రథముడు మన మహాత్మా గాంధీనే అని చెప్ప వచ్చును. గాంధీజీ ప్రభావం ప్రపంచ మంతటా పాకిందని నిరూపించడానికి ఎన్నో ఉదాహరణలు, ఉదంతాలూ వున్నాయి. దక్షిణాఫ్రికా పరివర్తనలో గాంధీ ఆలోచనలు ప్రముఖ పాత్ర పోషించాయి అన్నారు నల్లజాతికి మహానాయకుడనిపించుకొన్న దిగ్గజం 'నెల్సన్ మండేలా'.. 1893వ సంవత్సరంలో ఒక సామాన్య, అనుభవం లేని వకీలుగా సౌత్ ఆఫ్రికాలో ప్రవేశించి అనేక అవమానాలను, అష్టకష్టాలను భరించి, ఆ ప్రదేశమే తన ఉద్యమవేదికగా మలుచుకొని తన అసాధారణ క్రమశిక్షణ, శ్రమతో 22 సంవత్సరాలు నివసించి, ఆ అనుభవంతో తిరిగి 1915లో స్వదేశానికి వచ్చిన గాంధీజీకి, సరోజినీ నాయుడు ఆధ్వర్యంలో ఘనస్వాగతం లభించింది. ప్రముఖ నాయకులంతా జేజేలు పలికినారు. అది మొదలు స్వాతంత్ర్యోద్యమంలో ఎన్నో ఉద్యమాలను రచించి సత్యాగ్రహాల ద్వారా ప్రజలను ఆకర్షించారు. ప్రపథమంగా నీలిరంగు పండించే రైతుల కష్టాలకు వ్యతిరేకంగా బ్రిటిష్ ప్రభుత్వంపైకి తన ఉద్యమ బాణాన్ని ',చంపారన్' పేరుతో వదిలాడు 1917 లో. తరువాత అనేక పోరాటాలు చేసి బ్రిటిష్ వారికి నిద్రలేకుండా చేశారు గాంధీజీ. ఇలా.. కార్మికవేతనాల కోసం అహ్మాబాద్ మిల్లు సమ్మె (1918)లోనూ, పంటనష్టమైనా శిస్తు బాదుతున్నందుకు సత్యాగ్రహం(1918) లోనూ, ఈ మూడు ఉద్యమాల విజయాలను ఆసరాగా చేసుకొని పోరాటం విస్తృతం చేసి ప్రభుత్వంపై మరిన్ని ఉద్యమాలతో విరుచుకు పడ్డారు గాంధీజీ. ఇలా రౌలట్ చట్టంపై 1919 లోనూ, సహాయ నిరాకరణోద్యమం(1921)లో, మరియు శాసనోల్ల ంఘన ఉద్యమం (19 30-1934), చివరిగా అత్యంత ప్రభావితమైన 'క్విట్ ఇండియా' 1942 తో బ్రిటిష్ పాలకు లలో భయం పుట్టించి పారిపోవాలనే ఆలోచనకు నాంది పలికించిన ఉద్యమం అయింది. దీనికితోడు సుభాష్ చంద్ర బోస్ 'నేషనల్ హిందూ ఫౌజ్' కూడా ఆంగ్లేయులను భయపెట్టింది. గాంధీజీకి 'మహాత్మ ' అన్న బిరుదు ఎవరిచ్చారు అన్న విషయం ఈ మధ్య చర్చలోకి వస్తుంది. ఇది చర్చించు కోవలసిన విషయం కాకపోయినా, గాంధీకి మహాత్మా అన్న సంబోధన అక్షరాలా సమం జసం. దేశప్రజలు ఈ నాటికి కూడా మహాత్మా అనకుండా గాంధీ పేరును ఉచ్చరించలేరు. అయినా మహాత్మ అన్న బిరుదు గురించి కొంత తెలుసుకుంటే మంచిదేమో.... అది 1915 సంవత్సరం. గాంధీజీ దక్షిణాఫ్రికా నుండి తిరిగివచ్చి, ఆయన చేపట్టిన శాంతి పోరాటాలను, శాంతి సిద్ధాంతాలను, వారి సాధారణ జీవనశైలిని, ఉన్నత విలువలను గమనించిన రవీంద్రనాథ్ టాగూర్ గాంధీజీని మొట్టమొదటిసారి 'మహాత్మా' అని సంబోధించారు అని అంటారు. దానికి ప్రతిగా గాంధీజీ టాగూర్ ను 'గురుదేవ్' అని ప్రతి సంబోధించారట. అలా ప్రసిద్ధమైంది మహాత్మా బిరుదు. ఈ ఉదంతమే చరిత్రలో ప్రసిద్ధమైంది.మరికొన్ని ఆధారాల ప్రకారం, గాంధీజీ కి సన్నిహితుడైన ప్రాంజీవన్ మెహతా1909 లోనే గోపాలక్రిష్ణ గోఖలే కు రాసిన ఒక లేఖలో గాంధీజీని 'మహాత్మా' అని సంబోధించిన దాఖలా వుంది. ఇలాగే ఇంకొకటి **' జెట్ పూర్ పత్రం'** 1915 వ సంవత్సరం జనవరిలో గాంధీజీ గుజరాత్ లోని జెట్ పూర్ ను సందర్శించినపుడు అక్కడి నాయకుడు నౌతమ్ లాల్ మెహతా గాంధీజీకి మహాత్మా అన్న బిరుదుతో ఒక సన్మాన పత్రాన్ని సమర్పించాడు. ఆ పత్రం నేటికీ జాతీయ గాంధీ మ్యూజియమ్ లో భద్రపరచబడివున్నది. ఏది ఏమైనా గాంధీని మహాత్మా గాంధీ అని పిలవడం సమంజసం, సంస్కారవంతం, . ఇది కొంత మంది లేవనెత్తిన వివాదాంశమైనా, సర్వజన సమ్మతం, నిర్వివాదాంశం. గాంధీజీ 1917 లోనే అహ్మదాబాద్ సమీపంలో సబర్మతీ ఆశ్రమాన్ని స్థాపించి సత్యం, అహింస, సత్యాగ్రహాలను ఆయుధాలుగా మలచి ఎంతోమందిని పోరాటవీరులుగా తయారు చేసిన నేర్పరి. వీటికి మూలాలు గాంధీజీ అధ్యయనం చేసిన అనేక పుస్తకాలే. వాటిలో గీత, బైబిల్, ఖురాన్ కూడా వున్నాయి. రస్కిన్ రాసిన unto the last' థోరీ రాసిన 'civil disobedience , లాంటి పుస్తకాలు ఆయన భవిష్యత్ చర్యకు ప్రేరేపించినవి. గాంధీజీ ఇలా అంటారు... 'స్వామి వివేకానందుని జీవితం అధ్యయనం చేసిన తరువాత నాలో వున్న దేశభక్తి వేయిరెట్లు పెరిగింది' అన్నారు. ఆయన 7 పనులను పాపాలుగా ప్రకటించారు. 1.wealth without work. 2.pleasure without conscience. 3.science without humanity. 4.knowledge without charecter. 5. Politics without principles . 6. Commerce without morality. And 7. Worship without sacrifice ఇవన్నీ చేయకూడనివి అన్నారు మహాత్ముడు. ఎంతమంది విమర్శకులున్నా గాంధీజీ సిద్ధాంతాలు ఏకగ్రీవంగా ఆమోదించబడతాయి అంటారు విజ్ఞులు. ప్రపంచ మేధావులు కొందరు మహాత్ముని గురించి చేసిన కొన్ని వ్యాఖ్యలు... గాంధీపై మీ అభిప్రాయమేమని అడగగా బెర్నార్డ్ షా ఇచ్చిన సమాధానం... గాంధీపై అభిప్రాయమా! అయితే మీరు హిమాలయాలపై ఎవరి అభిప్రాయాన్నైనా అడగవచ్చు..!అన్నారు. 'మహాత్మా గాంధీ చరిత్రలో బుద్ధుడు, ఏసుక్రీస్తులతో సమానంగా నిలిచిపోతాడ' అన్నాడు ఎర్ల్ మౌంట్ బాటెన్. 'మూడు వందల మిలియన్ల ప్రజలను తిరుగుబాటుకు పురిగొల్పిన, బ్రిటిష్ సామ్రాజ్య పునాదులను కదిలించిన గత 200 సంవత్సరాలలో మానవ రాజకీయాలలో అత్యంత బలమైన ప్రేరణను ప్రవేశపెట్టిన వ్యక్తి ఇతనే... అంటూ గాంధీజీని ఉద్దేశిస్తూ పలికారు రోమైన్ రోలాండ్ అనే మహాశయుడు. లూయిస్ ఫిషర్ అనే యూదు-అమెరికన్ పాత్రికేయుడు ఇలా వక్కాణించాడు.... "సుదూర భారతదేశంలో గోచి కట్టుకున్న ఒక వృద్ధుడు మాత్రమే అయినా, ఆయన మరణించినప్పుడు ప్రపంచ మానవాళి విలపించింది. "ఒక నోబెల్ శాంతి బహుమతి గ్రహీత కొలంబియా విశ్వవిద్యాలయ ప్రాంగణములో విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ తన జీవితంపై గాంధీజీ అత్యంత ప్రభావం చూపారని, ఆయన రచనలు విద్యార్థులందరూ చదవాలని కోరారు. ఆమె పేరు 'ఆంగ్ సాన్ సూకీ'. ఇలా ఇంకా ఎంతోమంది ప్రపంచ ప్రముఖులు మహాత్మా గాంధీ గొప్పతనాన్ని, నైతికవిలువలను, నిరాడంబరతనూ తమ తమ మాటలలో చాటారు. ఇలాంటి మహా మనీషిని కన్న మన భారతదేశం, మనమూ గర్వంతో వుప్పొంగడంలో ఆశ్చర్యం లేదు. ఈ మధ్య కొంతమంది గాంధీజీ పై బురద జల్లడం చూస్తున్నాం. చిన్నవాటిని కూడా భూతద్దంలో చూపిస్తూ ఆ మహావ్యక్తిని అప్రతిష్టపాలు చేసే ప్రయత్నం చేయటం ఏనుగు ముందు కుక్కల అరుపులు కాక మరేమిటని యావత్ ప్రజా సమూహాలు ప్రశ్నిస్తున్నాయి. ఏది ఏమైనా ' మహాత్మ' కు నిర్వచనం, మోహన్ దాస్ కరంచంద్ గాంధీ మాత్రమే అన్నది శుద్ధ వాస్తవం.

"Mahatma is not a monopoly of india alone, he belongs to the entire world. His relevance to the world is much more today "

-KHATAMI, ex president of iran.

బుద్ధుని తరువాత భారతదేశం ఏ మనిషినీ ఇంతగా గౌరవించలేదు. చరిత్ర తెలిసినంత వరకూ మరే జీవితం ఇంత ప్రభావితం చేయలేదు అని అన్నారు **'ది స్టోరీ ఆఫ్ సివిలైజేషన్'** రచయిత విల్ డ్యూరాంట్. ఇలాంటి మహా మనీషికి తన జయంతి సందర్భంగా నివాళులు అర్పించడం గాక , వారి సిద్ధాంతాలను ఆచరిస్తూ రేపటి తరానికి కూడా అందించే ప్రయత్నం చేయడమే అసలైన నివాళిగా భావిస్తున్నాను. చివరిగా...

**"ప్రపంచంలో మీరు చూడాలనుకుంటున్న మార్పు మీరే అవ్వండి"...** మహాత్మా గాంధీ.

(మహాత్మా గాంధీ అక్టోబర్ 2 జయంతి సందర్భంగా )



**-మాయకుంట్ల నారాయణరెడ్డి**
99896 86603

# కలెక్టరేట్‌ను ప్రారంభించిన సీఎం, కేంద్ర మంత్రి బండి



కరీంనగర్, సెప్టెంబర్ 30: (నేటినిజం ప్రతినిధి) నూతన కలెక్టరేట్ భవనాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి ప్రారంభించారు. బుధవారం కరీంనగర్ జిల్లా కేంద్రానికి చేరుకున్న సీఎం కు మంత్రులు అధికారులు ఘన స్వాగతం పలికారు.

అనంతరం కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ తో కలిసి కలెక్టరేట్ భవనాన్ని ప్రారంభించారు. కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు. నూతన ఛాంబర్ లో కరీంనగర్ కలెక్టర్ కు బాధ్యతలు అప్పగించనున్నారు.

కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, లక్ష్మణ్ కుమార్, తుమ్మల నాగేశ్వరరావు తో పాటు అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

# ఆసియా క్రీడల్లో స్వర్ణం.. చికిత, సాహిల్‌కు సీఎం రేవంత్ అభినందనలు

హైదరాబాద్, సెప్టెంబర్ 30: ఆసియా క్రీడల్లో పతకాలు సాధించిన చికిత, సాహిల్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలియజేశారు. ఆసియా క్రీడల్లో తెలంగాణ ఆర్చరీ క్రీడాకారిణి చికిత స్వర్ణ పతకాన్ని సాధించింది. మిక్స్‌డ్ కాంపౌండ్ ఆర్చరీలో చికిత-సాహిల్ జోడీకి గోల్డ్ వరించింది. దీంతో ఒకేరోజు రెండు స్వర్ణాలు సాధించిన చికిత.. 2028 లాస్‌ఏంజెల్స్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది. ఈ క్రమంలో ఆసియా క్రీడల్లో సర్ణం సాధించిన పెద్దపల్లికి చెందిన చికిత ప్రతిభపై ముఖ్యమంత్రి ప్రశంసలు కురిపించారు. చికిత విజయం తెలంగాణ క్రీడా చరిత్రలో



నిలిచిపోతుందని కొనియాడారు. చికిత పట్టుదల క్రీడాకారులకు స్ఫూర్తిదాయకమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# గ్రామసభల నిర్ణయాలకు ప్రాధాన్యం..

## వీబీ జీ రామ్ జీ అమలుపై మంత్రి సీతక్క సమీక్ష

హైదరాబాద్, సెప్టెంబర్ 30:(నేటినిజం ప్రతినిధి): వీబీ జీ రామ్ జీపై మంత్రి సీతక్క వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలుకు సంబంధించి క్షేత్రస్థాయి పరిస్థితులపై సమీక్ష చేపట్టారు. గ్రామాల్లో పనుల గుర్తింపు, ఉపాధి కల్పన, పనుల పురోగతిపై అధికారులతో చర్చించారు. సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి క్షేత్రస్థాయి సమస్యలపై మంత్రి ఆరా తీశారు. VB–G RAM G అమలులో గ్రామ పంచాయతీల పాత్ర, బాధ్యతలపై దిశానిర్దేశం చేశారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఉపాధి అవకాశాలు అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు. పనుల ఎంపికలో గ్రామసభల నిర్ణయాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.



ఉపాధి పనుల్లో పారదర్శకత, నాణ్యత, జవాబుదారీతనానికి పెద్దపీట అని మంత్రి తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించేలా మండల, జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. గ్రామీణ ప్రజలకు ఉపాధి, గ్రామాలకు అభివృద్ధి, VB–G RAM G అమలును మరింత పటిష్ఠం చేయాలని మంత్రి సీతక్క దిశానిర్దేశం చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో 12 వేల మందికిపైగా సర్పంచులతో పాటు పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మండల, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఎన్నికల కమిషన్‌లో విభేదాలపై ఇండియా కూటమి సమావేశం..!



న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 30: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా డిమాండ్ నేపథ్యంలో ప్రతిపక్ష ఇండియా కూటమి ఇవాళ ఢిల్లీ లో సమావేశమైంది. ఈ భేటీలో కేంద్ర ప్రభుత్వం , ఎన్నికల సంఘం పై ఉమ్మడి పోరుకు సంబంధించిన భవిష్యత్ కార్యాచరణపై చర్చించనున్నారు.

ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటర్ల జాబితా నుంచి సుమారు 13 కోట్ల పేర్లను అక్రమంగా తొలగించారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఎస్ఐఆర్ ప్రక్రియపై ఎన్నికల కమిషన్ లోనే అంతర్గత విభేదాలున్నాయని, ఇద్దరు కమిషనర్‌లు పలుమార్లు అభ్యంతరాలు తెలిపారని మీడియా కథనాలు రావడంతో ఈ వివాదం మరింత ముదిరింది. ఈ నేపథ్యంలో ఎస్ఐఆర్ ప్రక్రియను తక్షణమే నిలిపివేసి, తొలగించిన ఓటర్ల పేర్లను తిరిగి చేర్చాలని, సీఈసీ తన పదవికి రాజీనామా చేయాలని కూటమి డిమాండ్ చేస్తోంది.

ఈ సమావేశంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, సోనియా గాంధీతోపాటు తృణమూల్ కాంగ్రెస్, ఎస్పీ, వామపక్షాలు, ఎన్‌సీపీ (ఎస్పీ), శివసేన (యూబీటీ) నేతలు పాల్గొంటున్నారు. సీఈసీని తొలగించేందుకు పార్లమెంటు ఉభయసభల్లో కొత్తగా అభిశంసన నోటీసు ఇవ్వడం, దేశవ్యాప్త ఆందోళనలు చేపట్టడం వంటి అంశాలపై చర్చించి తుదినిర్ణయం తీసుకోనున్నారు. అయితే ఈ కీలక సమావేశానికి డీఎంకే, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) దూరంగా ఉంటున్నాయి.

# అన్నదాతకు తీపి కబురు..

**రబీ ఎంఎస్‌పీ పెంచిన కేంద్రం**
**కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయం**
**రైతుకు దీపావళి కానుక.. రబీ పంటలపై కేంద్రం వరాల జల్లు!**
**ఆరు ప్రధాన పంటల కనీస మద్దతు ధరలు పెంపు**
**గోధుమలకు రూ.150.. తెల్ల కుసుమలకు అత్యధికంగా రూ.675 పెరుగుదల**
**రైతులకు పెట్టుబడిపై మెరుగైన రాబడే లక్ష్యమన్న కేంద్రం**

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 30: దేశంలోని రైతులకు కేంద్ర ప్రభుత్వం దీపావళి కానుక అందించింది. రాబోయే రబీ మార్కెటింగ్ సీజన్‌కు సంబంధించి ఆరు ప్రధాన పంటల కనీస మద్దతు ధరలను (ఎంఎస్‌పీ) పెంచుతూ కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు ఆమోదం లభించింది. రైతులకు సాగు వ్యయానికి అనుగుణంగా మెరుగైన ఆదాయం కల్పించడం, పప్పుధాన్యాలు, నూనెగింజల ఉత్పత్తిని ప్రోత్సహించడం లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రం వెల్లడించింది.

రబీ పంటల్లో ప్రధానమైన గోధుమల కనీస మద్దతు ధరను క్వింటాల్‌కు రూ.2,425 నుంచి రూ.2,575కు పెంచారు. అంటే ఒక్కో క్వింటాల్‌పై రూ.150 అదనంగా రైతులకు లభించనుంది. ఇక శనగల ఎంఎస్‌పీని రూ.5,440 నుంచి రూ.5,650కు పెంచారు. బార్లీ ధరను రూ.1,850 నుంచి రూ.1,980కు పెంచగా.. ఎర్ర కందుల ధరను రూ.6,425 నుంచి రూ.6,700కు సవరించారు.

నూనెగింజల సాగును ప్రోత్సహించే ఉద్దేశంతో తెల్ల కుసుమల మద్దతు ధరలో అత్యధికంగా పెంపు ప్రకటించారు. క్వింటాల్‌కు రూ.5,800గా ఉన్న ధరను రూ.6,475కు పెంచారు. దీంతో ఒక్కో క్వింటాల్‌పై రూ.675 అదనపు మద్దతు ధర లభించనుంది.

ఆవాల ఎంఎస్‌పీని రూ.5,650 నుంచి రూ.5,950కు పెంచారు.

పెరిగిన ఎంఎస్‌పీ వివరాలు

| పంట | పాత ఎంఎస్‌పీ | కొత్త ఎంఎస్‌పీ |
|---|---|---|
| గోధుమలు | రూ.2,425 | రూ.2,575 |
| శనగలు | రూ.5,440 | రూ.5,650 |
| బార్లీ | రూ.1,850 | రూ.1,980 |
| ఎర్ర కందులు | రూ.6,425 | రూ.6,700 |
| తెల్ల కుసుమలు | రూ.5,800 | రూ.6,475 |
| ఆవాలు | రూ.5,650 | రూ.5,950 |



**రైతులకు మెరుగైన ఆదాయమే లక్ష్యం**

వ్యవసాయ వ్యయాలు, ధరల కమిషన్ (సీఏసీపీ) సిఫార్సుల ఆధారంగా ఈ ధరలను నిర్ణయించినట్లు కేంద్రం తెలిపింది. ఉత్పత్తి వ్యయంపై రైతులకు గణనీయమైన రాబడి వచ్చేలా ఎంఎస్‌పీలను సవరించినట్లు పేర్కొంది. పప్పుధాన్యాలు, నూనెగింజల సాగును పెంచడం ద్వారా దేశీయ ఉత్పత్తిని బలోపేతం చేయడం, దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడం కూడా ఈ నిర్ణయం వెనుక ప్రధాన ఉద్దేశమని కేంద్రం వెల్లడించింది.రబీ సాగుకు సిద్ధమవుతున్న సమయంలో ఎంఎస్‌పీ పెంపు రైతులకు ఊరటనిస్తుందని వ్యవసాయ వర్గాలు భావిస్తున్నాయి. ముఖ్యంగా గోధుమలు, పప్పుధాన్యాలు, నూనెగింజల సాగు చేసే రైతులకు ఈ నిర్ణయం ప్రయోజనం చేకూర్చే అవకాశం ఉంది.

# ఆసియా క్రీడలు: ఒకే రోజు నాలుగు స్వర్ణాలు.. ఆర్చరీలో హ్యాట్రిక్



న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 30: ఆసియా క్రీడల్లో బుధవారం భారత అథ్లెట్లు చెలరేగిపోతున్నారు. గంటల వ్యవధిలోనే నాలుగు స్వర్ణ పతకాలు సాధించారు. ఆర్చరీలో హ్యాట్రిక్ గోల్డ్ రావడం విశేషం. ఇప్పటికే మహిళల టీమ్ ఈవెంట్‌లో తెలుగమ్మాయిలు జ్యోతి సురేఖ, చికిత, మహారాష్ట్రకు చెందిన ప్రీతిక త్రయం చైనాను ఓడించి స్వర్ణ పతకం సాధించిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత మిక్స్‌డ్ టీమ్ విభాగంలో చికితా, సాహిల్ జాదవ్ జోడీ దక్షిణ కొరియాతో జరిగిన ఫైనల్‌లో పసిడి దక్కించుకున్నారు.తాజాగా కాంపౌండ్ పురుషుల ఆర్చరీ ఈవెంట్‌లోనూ భారత్‌కు గోల్డ్ మెడల్ వచ్చింది. సాహిల్ జాదవ్, గణేశ్ మణిరత్నం, కుషాల్ త్రయం చైనాపై అద్భుత ప్రదర్శనతో నెగ్గారు. దీంతో ఒకే రోజు ఆర్చరీలో భారత్ మూడు స్వర్ణాలు కైవసం చేసుకుంది.ఆర్మీ షూటర్ నీరూ దండా రెండోరోజూ తన విజయ ప్రయాణాన్ని కొనసాగించింది. కైనాన్ చెనైతో కలిసి ట్రాప్ మిక్స్‌డ్ షూటింగ్ టీమ్ విభాగంలో స్వర్ణాన్ని సొంతం చేసుకుంది. మంగళవారం జరిగిన పోటీల్లో వ్యక్తిగత ట్రాప్ ఈవెంట్‌లో పసిడి గెలిచిన భారత తొలి మహిళగా నీరూ రికార్డు సృష్టించిన సంగతి తెలిసిందే. అటు మహిళల ట్రాప్ షూటింగ్ టీమ్ ఈవెంట్‌లోనూ రజత పతకాన్ని దక్కించుకుంది.

భారత బాక్సర్ ప్రియా ఘంఘస్ ఆసియా క్రీడల్లో కాంస్యంతో సరిపెట్టుకుంది. 60 కేజీల విభాగంలో పోటీ పడిన ఆమె.. చైనా బాక్సర్ యాంగ్ చేతిలో ఓడి, సెమీ ఫైనల్‌తో తన ప్రయాణాన్ని ముగించాల్సి వచ్చింది. ఇక మహిళల బాక్సింగ్ 75 కేజీల విభాగంలో భారత్‌కు కనీసం రజతం ఖాయమైంది. ఒలింపిక్ కాంస్య పతక విజేత లవ్లీనా బోర్గోహైన్ ఫైనల్‌కు దూసుకెళ్లింది . అక్కడ చైనాపై ఫైనల్‌లో స్వర్ణం కోసం పోటీ పడనుంది. కాగా భారత్ ఖాతాలో ఇప్పటి వరకు 58 పతకాలు వచ్చి చేరాయి. అందులో 10 స్వర్ణాలు, 21 రజతాలు, 27 కాంస్యాలు ఉన్నాయి.

**చురక**

మతం కులం పేరుమీద
మన నేతల తమాషా
అదొక్కటే అందించదు
అధికారం హమేషా
దేవున్ని విభజించే
దేవులాట వింత స్వరం
ప్రజల్లోనా వికటిస్తే
పట్టుతుంది పీడ జ్వరం



-వేల్పుల నారాయణ
9440433475

**రాధశ్రీ రాగాలు**

సీమ ఔన్నత్యమ్ము
చెప్పు సాహిత్యమ్ము
చదువ వలె నిత్యమ్ము
అనును రాధశ్రీ !!
భవములను కడుగంగ
భవహరుని అడుగంగ
పరుగు పెట్టెను గంగ
అనును రాధశ్రీ !!



-రాధశ్రీ
సెల్:9494481210

నేటినిజం
# సాహితీ కెరటాలు

website:www.netinijam.com

website: www.netinijam.com

2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 గురువారం 1-10-2026


## చేదునిజం..

నీవు వెళ్ళిపోతావు,
ప్రపంచం నడుస్తూనే ఉంటుంది.,
ఇంటిముందు టెంటు తీయగానే,
ఒకరోజు లో గల్లీ,
నిన్ను మరచిపోతుంది..,
ఫ్లెక్సీ.. కూడలిలో కూలగానే,
రెండురోజుల్లో.. నిన్ను
ఊరూ మరచిపోతుంది,
పదమూడవ నాడు,
చేతులు కడిగాక బంధువులు
మరచిపోతారు,
నెలరోజులకు....,
ఫోటోఫ్రేమ్ గోడకెక్కగానే,
ఇంటోళ్ళు నిన్ను
మరచిపోతారు..,
నీవు వెళ్ళిపోతావు,
లోకం నడుస్తూనే ఉంటుంది..,
టెంటు మరో ఇంటిముందు..
ఫ్లెక్సీ మరో కూడలిలో...
భోజనాలు మరోచోట..
ఫోటోఫ్రేము
మరెవరిదో గోడనెక్కుతూ...
కాలసింధువులోని బిందువులో
వందో.. వెయ్యో.. లక్షో..వంతు నీవు..
నీవు మాత్రమే వెళతావు..
లోకం నడుస్తూనే ఉంటుంది..!



– డా.కాసర్ల నరేశ్ రావు
9441406252

## అక్షరం నిర్మించిన జీవితం నాది!

అక్షరం నన్ను రాయలేదు
నన్నే తిరిగి నిర్మించింది.
ఒక పదంగా కాదు
ఒక పరిపూర్ణ ప్రయాణంగా.
పుట్టుక నాకు శరీరాన్నిచ్చింది
అక్షరం నాకు వ్యక్తిత్వాన్నిచ్చింది.
తల్లి పాలతో పెరిగిన దేహం
పుస్తకాల పాలతో పెరిగిన ఆత్మ.
నాకు దొరికిన సంపద
బంగారు గనులు కాదు
ఒక్కో పుస్తకం తెరిచినప్పుడల్లా
వెలుగుల గనులే తెరుచుకున్నాయి.
అక్షరం నా చేతిలో కలం కాదు
నా చీకటిలో దీపమైంది.
ప్రశ్నించడం మాత్రమే కాదు
పడిపోతే లేవడమూ నేర్పింది.
నేను రాసిన ప్రతి వాక్యం
కాగితంపై సిరా కాదు
కాలం మీద నేను వేసిన
జీవిత సంతకం.
అక్షరం నాకు
ఆకలి తీర్చే అన్నం కాదు
ఆకలి ఎందుకు పుడుతుందో
అర్థం చెప్పిన జ్ఞానం.
నా రక్తనాళాల్లో ప్రవహించింది
రక్తమే కావచ్చు
నా ఆలోచనల నాళాల్లో
ప్రవహించింది అక్షరమే.
అందుకే నా జీవితం
కాలానికి బందీ కాలేదు
అక్షరానికి వారసుడినై
యుగాలకు సాక్షిని అయ్యాను.
నేను నిర్మించిన ఇల్లు
ఎప్పుడైనా నేలమట్టం కావచ్చు
నేను నిర్మించిన పదం మాత్రం
తరాల హృదయాల్లో నివసిస్తుంది.
అందుకే...
నా చిరునామా ఒక ఊరు కాదు
ఒక పుస్తకం.
నా వంశం ఒక ఇంటి పేరు కాదు
ఒక ఆలోచన.
నా ఆస్తి ఒక భూమి కాదు
ఒక విలువ.
దేవుడు నన్ను మనిషిగా సృష్టించాడు
అక్షరం నన్ను 'నేను'గా నిర్మించింది.
జన్మ నాకు ఉనికినిస్తే
అక్షరం నాకు అమరత్వాన్నిచ్చింది.
చివరికి నేను మిగిలేది
ఒక శరీరంగా కాదు
ఒక శాసనంగా కాదు
ఒక అక్షరంగా.
ఎందుకంటే...
అక్షరం నిర్మించిన జీవితం నాది!
అందుకే నా శ్వాసకూ అర్థం ఉంది
నా మౌనానికీ భాష ఉంది
నా మరణానికీ ముగింపు లేదు.
అక్షరం చావదు...
అక్షరంతో నిర్మించబడిన జీవితం
కూడా చావదు.



– ఆచార్య
కదారు వీరారెడ్డి
9392447007

## పిల్లలు ఎగిరిపోయాక

ఇప్పుడు పావురాలతోనే నా స్నేహం
రోజూ ఉదయాన్నే డాబామీద నడక
నా హాజరును నమోదుచేస్తూ పావురాలు
వాటి రెక్కలనిండా కవిత్వాలే
కవుల ముఖాలతో పలకరిస్తున్నాయి
నా చుట్టూ అవి ఎగురుతున్నప్పుడు
ఎడారి ఇసుక ఒక్కసారిగా
పువ్వుల్లా మారుతున్న దృశ్యం
దారితప్పిన వసంతాలు
తిరిగి చిగురిస్తున్న చప్పుడు
నా ప్రేమను గింజల్లా మార్చి
రోజూ పావురాలకు చల్లుతున్నాను
చిత్రంగా వాటి చూపుల నిండా నా చిత్రాలే
మెల్లగా నా మీద వాలటం నేర్చుకున్నాయి
నా భుజాల మీద అవి నిలబడ్డప్పుడు
నాన్న స్పర్శ రక్తమై నా వొంట్లో
ప్రవహిస్తోంది
వాటి ముక్కులతో నా బుగ్గల్ని ముద్దాడినప్పుడు
మరణించిన అమ్మ మళ్లీ నన్ను పలకరిస్తోంది
ప్రేమబంధానికి కొత్త వ్యాకరణాలతో
అవి కావ్యాలను ఆవిష్కరిస్తున్నాయి
నిద్రరాని నా రాత్రులన్నీ ఇప్పుడు మాయం
యుద్ధాలు లేని రాజ్యానికి నేనే చక్రవర్తిని
ఇప్పుడు నేను ఒంటరివాడిని కాదు
వాటి మధ్య రెక్కలతో ఎగురుతున్నాను
రోజూ నేను ఎదురుచూసే ఆ ఉదయం
తన వెలుగును తాళపత్రాలుగా మార్చి
ప్రపంచం ఊహించని పావురాల స్నేహాన్ని
పురాణాలుగా రాసుకోమంటోంది
ప్రాతఃకాలం కాదది, నా తలరాతకు
కొత్త రాతల శిలాఫలకమది
పిల్లలు రెక్కలొచ్చి ఎగిరిపోయాక
ఇప్పుడు పావురాలతోనే నా స్నేహం
పావురాలే నా ప్రాణం



–డా|| కె.జి. వేణు
98480 70084



## చందూ
(కథ)

కాకినాడ రైల్వే స్టేషన్ గౌతమి ఎక్స్ ప్రెస్ కోసం అంతా ఎదురు చూస్తున్నారు.

'డాడీ రైలెప్పుడొస్తుంది, అని ఆ కుర్రాడు తండ్రిని అడిగాడు. ''పదినిమిషాల్లో వస్తుంది చందూ''.... అని ప్రేమగా జవాబిచ్చాడు తండ్రి. అప్పటికి చందూ ఆ ప్రశ్న పదిసార్లడిగాడు. తండ్రి విసుక్కోలేదు.

'డాడీ తాత గారింటికి నువ్వు రాకూడదూ' అన్నాడు చందూ. చందూకు అయిదేళ్లు నిండి ఉంటాయి. చాలా చురుకైన కళ్లు పదునైన ఆలోచనలు, ఘాటైన ప్రశ్నలు, జీన్స్ ప్యాంట్ ఫుల్ హ్యాండ్ర టీ షర్ట్ వేసుకున్న చందూ ఒక్క క్షణం కూడా మౌనంగా లేడు. రైలు కదలడం లేదు. కాని అతని కదలికలు ఆగడం లేవు, ఆగడు.

"ముందు నువ్వు వెళ్లు. మమ్మీ నువ్వూ కలిసి వెళ్లు, నేను ఆతరవాత వస్తాను. సరేనా.."

'ఇప్పుడే మాతో రా డాడీ' అని చందూ మారాంచేస్తున్నాడు. తల్లి కొడుకును చిరునవ్వుతో చూస్తున్నది. ఆమె మాట్లాడడం లేదు. జరీ అంచు నీల చీర, అదే రంగు జాకెట్, అందమైన ఆకారం, చామనఛాయ, మితభాషణం కావచ్చు. కొడుకుతో పాటు ఆమె కూడా భర్తను తనను రమ్మనడం లేదు.

రైలు వచ్చింది.

చందూ, మమ్మీలను రైలెక్కించాడు. తండ్రి ఇద్దరినీ కూచో బెట్టుకుని సామాన్లు సర్ది, కొడుకు వంక ప్రేమతో చూస్తున్నాడు.

'డాడీ తొందరగా దిగు డాడీ'.

'దిగుతాన్రా, తొందరపడకు. ఇంకా రెండు నిమిషాలు టైముంది కదా'.

కాసేపు ఆగి, వెంటనే 'రైలు కదులుతుంది డాడీ...దిగు.'

మళ్లీ మారాం చేశాడు. తల్లి చిరునవ్వుతూ కొడుకును చూస్తున్నది. ఆమె మాట్లాడడం లేదు. చందూ మాత్రం తండ్రి త్వరగా దిగిపోవాలని ఆదుర్దాగా ఉన్నాడు. తాత గారింటికి వెళ్తున్న సంబరం, తండ్రి వెంటరావడం లేదనే బాధా రెండూ అతని ముఖంలో ప్రస్ఫుటమవుతున్నాయి. అయినా తొందరగా రైల్ దిగాలనే, లేకపోతే ఏమవుతుందో అనీ, ప్రమాదమేమవుతుందో అన్న ఆందోళన చందూ చిన్నారి ముఖంలో స్పష్టంగా కనిపిస్తూనే ఉంది. కాస్సేపాగి తండ్రి రైలు దిగి, కిటికీ దగ్గరకు వచ్చాడు. చందూ గబగబా తన సీటు దిగి, అక్కడి కిటికీ దగ్గరకి వచ్చి తండ్రితో ఏదో మాట్లాడుతున్నాడు. రైలు కదిలి కొంత దూరం సాగిపోయే దాకా తండ్రికి బై బై అని చెబుతూనే ఉన్నాడు. మమ్మీ మౌనంగా ఉంది.

'మన వెంట డాడీ ఎందుకు రావడం లేదు...' మమ్మీని అడిగాడు చందూ. ఆమె నవ్వేదానికి జవాబు. చందూ మళ్లీ మమ్మీని ఆ మాట అడగలేదు. ఆ కోచ్ లో చుట్టూ ఉన్న వాళ్లని పరిశీలిస్తున్నాడు.

కాలం వలె రైలు శరవేగంగా పరిగెత్తుతున్నది, మైళ్లు గడిచిపోతున్నాయి. తను మమ్మీ వెంట ఉన్నాడు. డాడీ మైళ్ల దూరంగా ఉన్నా మనసు డాడీని పలకరిస్తున్నది. తన వెంట ఎందుకు రాలేదని అని అర్థం కావడం లేదు. చందూ మనసు ప్రశ్నలకు జవాబు లేదు.

కిటికీ లోంచి బయటికి చూస్తూ ఉంటే, కనిపిస్తున్న దృశ్యాలు చందూ ఆలోచనలు మళ్లిస్తున్నాయి. మమ్మీ పక్క సీట్ లోకి వెళ్లింది. ఆమె వెంట ఒక అంకుల్ మాట్లాడుతున్నాడు. సైడ్ కిటికీకి వైపు ఎదురుగా ఉన్న సింగిల్ సీట్లు, దాన్ని బెర్త్ గా మార్చారు. అంకుల్ తో మమ్మీ మాట్లాడుతూనే ఉంది. మమ్మీ వెనుకకు జరిగి కూర్చోలేదు. అంకుల్ దర్జాగా వెనక్కి జరిగి మమ్మీ ముందుకు జరిగి ఇంకా వంగి అంకుల్ తో మాట్లాడుతున్నది. చందూకు వినబడడం లేదు. కాస్సేప యిన తరువాత చందూ పై బర్త్ పైకి ఎక్కాడు. ఇంకో వైపు నుంచి పైకి వచ్చాడు, దిగాడు. ఏదో అంటున్నాడు. కాసేపు కిటికీలోంచి చూస్తున్నాడు. "చందూ పడుకుంటావా?.... పడతావు జాగ్రత్త... 'అని మమ్మీ మధ్యమధ్య ఏదో అంటున్నది. అంకుల్ తో ఆమె మాట్లాడే మాటలు అంకుల్ కైనా వినిపిస్తున్నాయా? చందూ తన అల్లరి తాను బిజీగా ఉన్నాడు.



–ఆచార్య మాడభూషి శ్రీధర్
8447651505

> మమ్మీ డాడీ ఒళ్లోలేదు. ఎప్పుడైనా ఉందో లేదో తెలియదు.
> తాను చూడలేదు. ఇప్పుడు తాను చూడవద్దనుకున్నా చూస్తున్నాడు.
> డాడీ కాని వ్యక్తి ఒళ్లో తన మమ్మీ.
> వినాలనుకోకపోయినా వినిపిస్తున్నవి. డాడీ కాని వ్యక్తితో
> మమ్మీ ముచ్చట్లు. చందూ డాడీని గుర్తు చేసుకుంటున్నాడేమో.

కోచ్ లో లైట్లు వెలుగుతున్నాయి. బయట చీకటి, కటిక చీకటి. కిటికీ లోంచి బయటకు చూస్తూ ప్రకృతిని అనుభవించే అవకాశం సూర్యాస్తమయంతో పోయింది. అంతలోగా కాస్త వర్షపు చినుకులు పడగానే అందరూ కిటికీలు మూసేశారు. చందూ... ఒక కోచ్ లోపల మొత్తం ప్రపంచం. అందరూ సంచుల్లో టిఫిన్ డబ్బాలలో తిండి పదార్థాలను తీసి రైల్లో రాత్రి భోజన కార్యక్రమాలకు బిజీగా ఉన్నారు. చందూకు కొన్ని చిప్స్ చాక్లెట్స్ బిస్కెట్స్ ఇచ్చాడు డాడీ. మమ్మీ నాజూగ్గా నడుచుకుంటూ వచ్చి కిటికీ వైపు కొక్కేనికి తగిలించి క్యారీ భోజనం సంగతి చూస్తున్నాడు. చందూ అల్లరి చేయడం లేదు. చందూ ఏ కదలికలు కనబడడం లేదు. లోయర్ బెర్త్ పై ఓ మూలకు కూచుని వచ్చిపోయే మనుషుల్ని చూస్తున్నాడు. ఆ దారిలో ఎవరూ నడవలేవడం కష్టం. వారితో మాట్లాడుతున్నట్టు వినిపిస్తున్నది. మధ్య బెర్త్ నిలబెట్టిన తరువాత సీటున్నవాళ్లు కూర్చోవడానికి తగిన ఏర్పాట్లు ఉన్నాయి. చందూకు వినడబడడంలేదు.

ఆ పచ్చని జరీ అంచు నీలి రంగు చీరకు చాలా దగ్గరగా 'అంకుల్' ఉన్నాడు. ఎవరికీ వినిపించని మాటలు సాన్నిహిత్యంలో శబ్దసాంద్రత తరిగిపోతున్నది. చందూ మాటలు తగ్గిపోతున్నంత వేగంతో వారితో సాన్నిహిత్యం సాంద్రత పెరిగిపోతున్నది.

నిటారుగా కూచోవడానికి వీల్లేని లోయర్ బెర్త మీద అతను, ఆయన ఒళ్లో మమ్మీ పడుకున్న ఆవె నడుముపై తల ఆన్చి ఎదుటి బెర్త్ కాళ్లలో ఆమెను పడిపోకుండా ఆపిన భంగిమలో ఇద్దరూ చీకటి ముచ్చట్లో మునిగి పోయారు. లోయర్ బెర్త్ సీటులో కొడుకు కాళ్లు చాపి, కిటికీ దగ్గర పెట్టి, కూర్చున్న అతనిప్పుడు మాట్లాడడం లేదు. వినడం ఇష్టం లేకపోయినా వినవలసి వస్తుందని అతని ముఖం చెప్తున్నది.

రైలు పరిగెత్తి పోతున్నది. కాలం స్తంభించిపోయింది. అర్ధరాత్రి చేరవుతున్నా చందూ కళ్లు మూతపడడం లేదు. మమ్మీ చందూ చేయుపట్టిలాగి అది బెర్త్ మీద పడుకోపెట్టే ప్రయత్నం చేసింది. చందూ విసురుగా చేతిని విదిలించుకున్నాడు. మళ్లీ పట్టుకోబోతే విసుగ్గా కొట్టాడు. మమ్మీకి అంకుల్ ఒళ్లో ఉన్న మమ్మీని అతను మానడం లేదు. మానలేక పోతున్నాడు. మానవద్దని నిర్ణయించుకున్నాడు. చందూ కళ్లు ఆ చీకట్లో మెరుస్తున్నాయి. ఆలోచనలు ఏమిటో ఎంతగా రేగుతున్నాయో ఎవరూ చెప్పలేరు. మమ్మీతో మాట్లాడకుండా, నిద్రపోకుండా, మమ్మీ చెప్పినట్లు వినకుండా చేస్తున్న నిరసన స్పష్టం చేస్తున్నది. బెడ్ లాంప్ కూడా వెలగని కోచ్ చీకటి ముచ్చట్లలో అతని నిరసన కనబడడం లేదు. మమ్మీ డాడీ ఒళ్లోలేదు. ఎప్పుడైనా ఉందో లేదో తెలియదు. తాను చూడలేదు. ఇప్పుడు తాను చూడవద్దనుకున్నా చూస్తున్నాడు.

డాడీ కాని వ్యక్తి ఒళ్లో తన మమ్మీ. వినాలను కోకపోయినా వినిపిస్తు న్నవి. డాడీ కాని వ్యక్తితో మమ్మీ ముచ్చట్లు. చందూ డాడీని గుర్తు చేసుకుంటున్నాడేమో.

రైలు సాగిపోతున్నది. చీకటి ముచ్చట్లు సాగుతున్నాయి. భంగిమలు మారుతున్నాయి. మమ్మీ చేతులను అంకుల్ చేతులు చుట్టేస్తున్నాయి.

మరికొద్ది సేపటి తరువాత రెండు ఎదలు హత్తుకున్నాయి. మిడిల్ లోయర్ బెర్త్ మధ్య నింగీ నేలా కలిసిపోతున్నాయి. చందూ కళ్లు శూన్యపు దారి మీద కేంద్రీకృతమైనా మన నుచూనన్తానే ఉన్నది. అంతరంగపు రంగ స్థలం మీద దృశ్యం ఎప్పటికీ ఆ దృశ్యం కాన ంత గాఢంగా ముద్రితమవుతున్నది. చందూ ముఖం నిరామయంగా ఉంది. చిరాలోచనంగా లక్ష్యం లేని దిశను చూస్తున్నాయి చందూ కళ్లు.

చీకటి ముచ్చట్లు ఆగిపోయాయి. చర్చలు నిర్ణయానికి దారితీసాయో తెలియదు. బాడీ లాంగ్వేజ్ ఆగిపోయింది. అతను నాలుగు బెర్త్ ల తరువాత ఉన్న తన బెర్త్ కు వెళ్లిపోయాడు. జరీ అంచు నీలి చీర కొంగు లోపలకి చందూ ను ఆహ్వానించింది.

ఇటు తిరిగి పడుకున్నాడు చందూ. ఎవరైనైనా నిద్రపుచ్చగల కాలం చందూ కళ్లను మూసింది. ఉప్పొంగిన సముద్రాలను అణచి చిన్నారి హృదయం ఉపశమించింది.

గౌతమి ఎక్స్ప్రెస్ సికిందరాబాద్ వైపు పరిగెత్తుతున్నది. చందూకి అందరి కన్నా ముందే తెల్లారింది. జరీ అంచు నీలి చీర ముసుగులో మమ్మీ నిద్రిస్తున్నది.

చందూ మాత్రం హైదరాబాద్ కోసం అక్కడున్నతాత కోసం తన మామయ్య కోసం ఎదురుచూస్తున్నాడు. వెలుగురేఖలు పరుచుకుంటున్న నేలను చూస్తున్నాడు. 'వెనక్కిపరుగెత్తుతున్న నేల ఆగింది. హైదరాబాద్ గా మారి, అప్పుడు తాత ఎప్పుడు కనిపిస్తాడా అని ఎదురు చూస్తున్నాడు.

జరీ అంచు నీల చీరలో మమ్మీ ముఖాన అదే చిరునవ్వు .... అదే మౌనం. .. రైల్లో రాత్రిని చందూ ఎప్పటికైనా మరిచిపోతాడా?

చందూ ఏనాటికైనా ఏఆడదాన్నయినా ప్రేమిస్తాడా?.... ముసురుకుంటున్న ప్రశ్నల్ని పక్కకు తోసుకుంటూ.. ముందుకు నడిచాను..

*(ఈ కథను 2003 జనవరి 31న 'నేటినిజం' సాహితీ కెరటాలులో ప్రచురించడం జరగింది..)*

## మన మాట మన భాష మన ఉనికి

నేలతల్లీ, భాషామతల్లీ రెండూ సమాన ధర్మాలు ప్రోది చేసుకున్నాయి అని అనిపిస్తూ ఉంటుంది. మట్టితో కూడిన నేల ఎన్నెన్ని రకాల పచ్చదనాలకీ, ఎన్నెన్ని వర్ణాల పుష్పాలకీ , ఎన్నెన్ని రకాల వృక్షాలకీ ఆలంబనమో , అక్షరాల గుచ్ఛమైన భాష కూడా అనేకమైన ప్రక్రియలతో విలసిల్లే సాహిత్యాది రచనలతో, గ్రంధాలతో , కావ్యాలతో, శాస్త్రాలతో విలసిల్లుతూ ఉంటుంది. మాటల తోటలైన భాషలు, ఒక్కో పరిమళంతో గుబాలిస్తూ ఉంటాయి, జీవిస్తూ ఉంటాయి. అటువంటి జీవనం మన ఉనికిని రక్షిస్తూ, దానికి వెలుగునిస్తూ ఉంటుంది.

నేడు భాషల ఘోషలు సముద్ర కెరటాల్లా, అవిశ్రాంతంగా, భూగోళం మీద పరుగు పందాలతో జుట్లు పట్టుకుంటున్నాయి. రాజకీయ యవనిక మీద రంగులు చెరిగిపోతున్న తమ తమ జెండాలని సవర్ణంగా, సాధికారంగా, తమ తమ నేల దిబ్బల మీద , తిరిగి పాతుకోవాలని పాకులాడుతున్నాయి, పోరు బాట పడుతున్నాయి. ఈ సందర్భం లో ఓ చిన్న ముచ్చట ఇక్కడ ఉటంకిస్తున్నాను. డా. నాగసూరి వేణుగోపాల్, కన్వీనర్, గాంధీ దర్శన్, హైదరాబాద్, గారు తన "గాంధేయమ్ ఓ గాణ్డీవం" అన్న వ్యాస పరంపరలో " పొట్టి శ్రీరాములును తెలుగు రాష్ట్రాన్ని సాధించి పెట్టిన యోధుడుగానే గుర్తించాం కానీ తెలుగు వంటి ఇతర భాషల వారికి కూడా అటువంటి రాష్ట్రాలను ఏర్పరచిపెట్టిన , దేశ చిత్రా పటాన్ని పునర్లిఖించిన భారత వీరుడు కూడా ఆయనే అని వివరించి చెప్పలేక పోయాం, పోతున్నాం " అని ఆవేదన చెందారు మాతృ భాషాపేక్షలో , నడుస్తున్న మాతృ భాషల పరిరక్షణ ఉద్యమ పోరాటాల నేపథ్యం లో.

సీమాంతరాల్లో భాషలు దిష్టి బొమ్మ అవతారాలు దాలుస్తాయి.

చరిత్ర కాల గతి లో మన దేశం లో భాషా ప్రయుక్త రాష్ట్రాలు చోటు చేసుకున్నాయి, ఉనికీ , సాంస్కృతిక, జీవనావరణం రంగాల ప్రాతిపదికగా, అనేక ఘర్షణల తరువాత, లడాయిల తరువాత, ప్రాణ త్యాగాల తరువాత. ఈ క్రమాన్ని అంతా రచయితా, పార్లమెంట్ సభ్యుడూ శశి థరూర్ గారు The linguistic principle served its purpose admirably, by translating diverse identities into manageable political units and ensuring that education and administration could be conducted in the mother tongue." అంటూ ప్రశంసించారు ఆయా మాతృ భాషల పురోభివృద్ధి, వాటి గుర్తింపు, ఉనికి ప్రయోజనాల గురించి.

ఇక్కడ తెలుగు నేల మీద , "కష్టం భలే పుణ్యం కదా'' అంటూ నామిని "పచ్చనాకు సాక్షిగా'' –రాయలసీమ మాండలికపు తెలుగు, "పలుకు బడి" అంటూ తెలిదేవార భానుమూర్తి తెలంగాణ యాస తెలుగు , 'చాత్రిబాబు' గా పిలవబడీ రావిశాస్త్రి ఉత్తరాంధ్ర యాస తెలుగు, ఎన్నో సొబగులు అద్దాయి తెలుగు భాషకి. త్యాగరాజు, అన్నమయ్య కీర్తనలు తెలుగులో అజరామరం. సంజీవదేవ్ గారి తెలుగు వాక్యం ఇంగ్లిష్ లాంటి మెరుపు.

మళ్ళీ శశి థరూర్ గారుని Half acentury later, the rationale for the creation of new states has shifted entirely, from cultural integration to developmental and administrative urgency." అని చెప్పినట్లు సాంస్కృతిక రంగం మీద ఆర్థిక రంగం పై చేయి గా మారి , దానికి తోడు సాంకేతికతాభివృద్ధి తో ఉపాధి మొదలగు రంగాల్లో ఇంగ్లిష్ ని భుజాల మీద మోస్తూ దించకుండా పోతున్నారు. ఎన్నో అసంబద్ధ వాదోపవాదనలు గావిస్తున్నారు.

మాతృభాషాబిమానం గురించి ఇక్కడ కొన్ని చిన్న ఉదాహరణలు : లాంతర్ల వెలుగులోనే చదువుకొన్న సుప్రీం కోర్ట్ ప్రధాన న్యాయ మూర్తి గారు "ఆంగ్లం లో మాట్లాడే పెద్దలకే సుప్రీం కోర్ట్ లో న్యాయం జరుగుతుందన్న దుష్ప్రచారం తగదన్నారు. " అలాగే అవిశ్రాంత విశ్రాంత జీవితం గడుపుతున్న ప్రముఖ పర్యావరణ శాస్త్రవేత్త ప్రొఫెసర్ కోలవెన్ను విఠల్ మూర్తి గారు " నేను తెలుగు భాషా ప్రేముకుణ్ణి . నా భార్య తెలుగు ప్రొఫెసర్ అని కాదు. నేను స్వయంగా కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారి శిష్యు న్ని. విజయవాడలో డిగ్రీ విద్యార్థి గా ఏకవీర నవలను విశ్వనాథ వారు బోధించగా విన్న అదృష్టవంతుణ్ణి. తెలుగు తప్పక ఒక సబ్జెక్టు గా తెలుగు వారు అందరూ చదవాలన్న కోరిక ప్రగాఢంగా గలవాడిని. పదవీ విరమణానంతరం ఓ ఇంజనీరింగ్ కాలేజీ కి ప్రిన్సిపల్ గా జేరి తెలుగు పాఠాలు బోధించాను." చెప్పుకొచ్చారు,.

**మాతృభాష పరిరక్షణ ఓ స్వీయ ధర్మం.**

నదులకి పుట్టినిల్లు ఉన్నట్లే జనజాతులకి భాషల పుట్టినిల్లు ఉంటాయి. మాతృ భాషలు మన కిరీటాలు. చిర్నవ్వులు భాషలో మొలకెత్తుతూ వుంటాయి. విజయ కేతనాలు ఎగరాలంటే మాతృ స్తన్యాన్ని చప్పరింపాల్సిందే. తల్లి భాషలకి వందనాలు సమర్పించాల్సిందే. !.

నేడు భూగోళం ఎంతగా వేడెక్కుతుందో, ఎంతగా పర్యావరణం ధ్వంసమవుతుందో ప్రతీ పౌరిడి దినవారీ అనుభవమే. దాని దిద్దుబాటి చర్యలు చేపట్టగలగ లేని రాజకీయ చర్యలు కూడా పౌరుల అనుభవమే. ఆపై సాంస్కృతిక నాగరికత దిగజార్చుతున్న సంగతీ విదితమే.

జిడ్డు కృష్ణ మూర్తి గారు 'పొలిటిక్స్ అన్న వ్యాసం ' లో It is so muh easier to throw oneself into social and political activity than to understand life as a whole; tobe associated with any organised thought , with political or religious activity, offers a respectable escape from the pettiness and drudgery of everyday life……Life is a total process , the inner as well as th outer; the outer definitely affects the inner, but the inner invariably overcomes the outer'- అని అంటారు. మాతృ భాషకి ముమ్మారు వందనాలు.



–ఒబ్బిని
9849558842

## పసివాడిలానన్న ప్రశ్నించు

ఓరి వారి
నీలో నీవే అలా దగ్ధమైతావెందుకు
నీవు మాట్లాడితే
నింగి విరిగి మీదేమీ పడదు.
నిలబడ్డ చోటు నుండి కదలవెందుకు
ఒక్కొక్క అడుగు ముందుకెయ్యి
నీకంటే ముందు
ఈ తొవ్వలోచాలామంది నడిచారు
ఆ ప్రస్థానాన్ని నీవు కొనసాగించాలి కదా.
దెబ్బ మీద దెబ్బ పడితే
ఇనుప ముక్క కాస్త కర్రై
నెర్రలిడిచిన నేలను చదును చేస్తుంది
నీవు ఇంకెన్ని దెబ్బలు తింటావు...?.
నీలో నీవు నుసులు తావెందుకు
మనసులో ఏముందో కక్కరాదా..?
గుండెనలా రెండు చేతుల మధ్యపెట్టి
ఒకటే పిసుకుతావెందుకు
ఇక ఈ బాదుడు చాలని అనరాదా..?.
ఓరి.. వారి.. జరా..
ఆ మౌనవ్రతాన్ని వదలరా
గర్జించక్కర్లేదు గమ్మున మాత్రం ఉండకు
పదుగురిలో పసివాడిలానన్న ప్రశ్నించు.



–డా||ఎడ్ల కల్లేశ్
9866765126

## బాపూజీ మళ్ళీ పుడతావా!?



పూర్వం చాన్నళ్ళ క్రిందట
ఓ పెద్దాయనుండే వాడు
ఆయనకంటే చిన్న వాళ్ళు కూడా
గాంధీ తాత అనే వాళ్ళు
గుండూ పిలకా ఖద్దరు కండువా
బోసినవ్వులూ, ఓ పాత కళ్ళజోడూ
చేతిలో సాదాసీదా ఊత కర్ర
కాళ్ళకు ఆకు చెప్పులూ
కళ్ళల్లో కరుణ పెదవిపై చిరునవ్వుతో
అలాంటి తాతమనింట్లో ఉంటే
ఎవ్వరం కేర్ చేసేవాళ్ళం కాదు
కానీ ఆ కళ్ళల్లో దృఢ సంకల్పం!
బక్క చిక్కిన శరీరంతో వడివడిగా
ఎంత దూరమయినా నడిచేసే ఆ కాలిబలం
ఎన్నడూ తిరిగిపోని ఆకు చెప్పులూ
ఆ బోసినోరూ ఆ సూటిచూపూ
భారతీయ సంప్రదాయానికి దర్పణం పడుతూ
గుండూ పిలకా
స్వాతంత్ర్యమే మా జన్మ హక్కన్న ధ్యేయం
ఆంగ్లేయులను తరిమి తరిమి కొట్టిన వజ్ర సంకల్పం
ఇవన్నీ కలిపితేనే మోహన్.. కరమ్‌చంద్
గాంధీజీ... గాంధీ..జీ మన గాంధీ
స్వాతంత్ర్య సమరోద్యమానికి నాంది ఎవరైనా
సాధించి పువ్వులో పెట్టి దోసిట్లో పోసింది
మన గాంధీజీ.. మన బాపూజీ
ఒక చెంపపై కొడితే రెండోచెంప చూపిన
ఉత్తమోత్తమ అహింసావాది గాంధీజీ
మరి ఈ రోజు ఎంతమంది మేకవన్నె పులులు
గాంధేయవాద ముసుగులతో
మన మధ్యే ఉన్నారో తెలుసా
అందుకే వెతకడానికి గాలిస్తు గాలిస్తూ
జైలులో ఇంకా మగ్గుతున్న శతాధిక
వృద్ధుడిని చూసా
గాంధేయవాదాన్ని సంపూర్ణంగా పాటించిన
కొన ఊపిరితో ఉన్నాడు
తాతా బాగున్నావా అన్నా అంతే
"చెళ్ళు..ఛెళ్ళు.." నా రెండు చెంపలూ వాయించాడు
గాంధీ మాటలు విని ఇన్నాళ్ళూ రెండో చెంప చూపించా
ఈ కాలంలో కుదరదు
రెండు చెంపలూ వాయించాల్సిందే
మళ్ళీ "ఛెళ్ ఛెళ్"
మా గాంధీ చేసిన తప్పు ఇక చెయ్యను
చెయ్యను.. అంటున్నాడు...



**-పంకజ మల్లిక్**
సెల్: 98660 65462

## పండుగల పరమార్థం

పండుగలు మన సంప్రదాయ ప్రతీకలు...
ఆచార వ్యవహారాలకు ఆనవాళ్ళు...
ఆరోగ్య సూత్రాలు నిండి ఉన్న అలవాట్లు...
కులమత భేదాల ప్రభావం లేని పండుగలు...
యుగానికి తొలిపండుగ ఉగాది...
జీవితం షడ్రుచుల సమ్మేళనంగా...
మామిడి తోరణాలతో...
అందరూ జరుపుకునే పండుగ...
తొలి పూజలందుకునే వినాయకుడు...
జమ్మి చెట్టుని పూజించే దసరా...
అమావాస్య రోజు వెలుగులు పంచే దీపావళి...
పంట చేతికి వచ్చే సంబరాల సంక్రాంతి...
ఋతువులకు అనుగుణంగా పండుగలు
అందరూ కలిసి ఆనందంగా జీవించాలని.
బంధుమిత్రుల ప్రేమ పంచుకుంటూ...
పిండివంటల ఘుమఘుమలతో
ప్రతి ఇంట్లో పండుగే...



**-షామీర్ జానకీదేవి**
9394611037

## మైలేవరిది

దళితులు అడుగుపెడితే నేల మైల పడిందట..
పసుపు నీళ్లతో నేలను పవిత్రం చేశారట..
దళితుడి చెమటతో కట్టిన భవనాలను
ఏ నీళ్లతో కడుగుతారు..?
ఎట్లా పవిత్రం చేస్తారు..?
దళితుడి అడుగుజాడ లేని
జాగ ఈ నేలపై ఎక్కడుంది..?
రాళ్లు కొట్టిన చేతులు ఎవరివి?
మట్టి మోసిన భుజాలు ఎవరి ?
ఇటుకకు ఇటుకకు మధ్య శ్రమ ఎవరిది?
చెమట ఎవరిది
భవనానికి పునాది రాళ్ళై నిలిచింది ఎవరు ?
మీ వెనక పిడికిండ్లై నడిచింది ఎవరు ?
నెత్తుటి చుక్కలతో మీకు అధికారాన్ని దారపోసిన
చేతులు ఎవరివి ?
ఈ శ్రమ దళితులది కాదా..?
ఈ త్యాగం దళితులది కాదా..?
భూమి, గాలి పంచభూతాలు
అందరివైనప్పుడు వాటికి లేని మైల
మనుషులైన మీకెందుకో ?
ఇది కులాహంకారం కాదా..?
ఇది అసమానత ఆనవాలు కాదా..?
మనుషులందరూ సమానమేనని
రాజ్యాంగం చెబుతున్నా..
రాజకీయాల రంగులు మార్చినా
కులం రంగు మాత్రం
ఆధిపత్య చేతుల్లో
మళ్లీ మళ్లీ పులుముకుంటూనే ఉంది..
ఫామ్‌హౌస్ గోడలు అడుగుతున్నాయి?
ఇటుక ఎవరి చెమటతో తడిసిందని..
నేల ఎవరి చేతులతో చదును అయ్యిందని
రోడ్డు ఎవరి కండరాలతో పుట్టిందని..
భవనం ఎవరి త్యాగాలతో నిలబడిందని..?
దళితుడు అడుగుపెట్టిన
నేల మైల కాదు?
దళితుడు అడుగుపెట్టని నేలే
నిజమైన మైల నేల!



**డి. రాములు**
9391376057



# భారీ వర్షాలు... అప్రమత్తతే ప్రాణరక్ష!

### మూడు రోజులుగా ఎడతెరిపిలేని వర్షాలు... ప్రజల ఆరోగ్యంపై ముప్పు, అప్రమత్తతతోనే సురక్షిత జీవనం

తెలంగాణ రాష్ట్రాన్ని గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. అనేక జిల్లాల్లో వాగులు, వంకలు, చెరువులు పొంగి పొర్లుతున్నాయి. లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. రహదారులు జలమయమవడంతో ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కొన్ని ప్రాంతాల్లో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి కూడా భయపడే పరిస్థితులు నెలకొన్నాయి. వాతావరణ శాఖ మరో 24 గంటల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరిస్తున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. భారీ వర్షాలు కేవలం వరదలనే కాదు... అంటువ్యాధులు, విద్యుత్ ప్రమా దాలు, రోడ్డు ప్రమాదాలు, గోడలు కూలిపోవడం, విషజంతువుల బెడద వంటి అనేక ముప్పులను వెంట తెస్తాయి. అందువల్ల ప్రభుత్వం, వైద్యాధికారులు, విపత్తు నిర్వహణ శాఖ జారీ చేసే సూచనలను ప్రజలు తప్పనిసరిగా పాటించాలి.

### అత్యవసరం లేకుంటే ఇంట్లోనే ఉండండి

వర్షం తీవ్రంగా కురుస్తున్న సమయంలో అత్యవసర పరిస్థితి తప్ప బయటకు వెళ్లకుండా ఉండటమే మంచిది. పిల్లలు, వృద్ధులు, గర్భిణులు, అనారోగ్యంతో బాధపడుతున్నవారు ఇంట్లోనే ఉండేలా కుటుంబ సభ్యులు జాగ్రత్తలు తీసుకోవాలి. వరద ప్రవాహాలు, వాగులు, వంకలు దాటే ప్రయత్నం చేయరాదు. సెల్ఫీలు, వీడియోల కోసం ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లడం ప్రాణాంతకం.

### లోతట్టు ప్రాంతాల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలి

చెరువులు, కాలువలు, వాగుల సమీపంలో నివసించే వారు అధి కారులు ఇచ్చే హెచ్చరికలను వెంటనే పాటించాలి. అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలిపోవాలి. ఇంట్లో తాగునీరు, పొడి ఆహారం, అవసరమైన మందులు, టార్చిలైట్, అదనపు బ్యాటరీలు, మొబైల్ పవ ర్ బ్యాంక్, ముఖ్యమైన పత్రాలను వాటర్‌ప్రూఫ్ కవర్లలో భద్రపరచుకోవాలి.

### విద్యుత్ ప్రమాదాలకు దూరంగా ఉండండి

తెగిపడిన విద్యుత్ తీగలు, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల సమీపానికి వెళ్లకూడదు. ఇంట్లోకి వరద నీరు చేరితే వీలైనంత త్వరగా మెయిన్ విద్యుత్ స్విచ్‌ను ఆఫ్ చేయాలి. నీటితో నిండిన రోడ్లలో విద్యుత్ లీకేజీ ఉండే అవకాశం ఉన్నందున అలాంటి ప్రాంతాల్లో నడవకూడదు. సమస్యలు కనిపిస్తే వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలి.

### బలహీనమైన చెట్లు, పాత గోడల వద్ద నిలవొద్దు

బలమైన గాలులతో చెట్లు విరిగిపడే ప్రమాదం ఉంది. శిథిలావస్థలో ఉన్న గోడలు, పాత భవనాలు ఎప్పుడైనా కూలిపోయే అవకాశం ఉంది. అలాంటి ప్రాంతాల్లో నిలబడకూడదు. వాహనాలను కూడా చెట్ల కింద లేదా బలహీనమైన గోడల పక్కన నిలిపివేయకూడదు.

### వర్షాకాల వ్యాధులపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

భారీ వర్షాల తర్వాత డెంగీ, మలేరియా, చికున్‌గున్యా, వైరల్ జ్వరాలు, టైఫాయిడ్, కలరా, వ్యాపించే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. రెండు రోజులకుపైగా జ్వరం, తీవ్రమైన తలనొప్పి, వాంతులు, విరేచనాలు వంటి వ్యాధులు శరీర నొప్పులు, బలహీనత వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలి. స్వయంగా మందులు వాడకుండా వైద్యుల సలహా తీసుకోవాలి.

### కాచిన వేడి నీళ్లు, పరిశుభ్రమైన ఆహారమే రక్షణ

తాగునీటిని తప్పనిసరిగా కాచి చల్లార్చిన తర్వాత మాత్రమే ఉపయోగించాలి. బయట విక్రయించే ఆహారం తినకుండా ఇంట్లో తాజాగా వండిన వేడి ఆహారానికే ప్రాధాన్యం ఇవ్వాలి. పండ్లు, కూరగాయలను శుభ్రంగా కడిగి వాడాలి. చేతులను తరచూ సబ్బుతో కడుక్కోవడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చు. శిశువులకు తయారు చేసే ఆహారం, పాలు కూడా పరిశుభ్రమైన నీటితోనే సిద్ధం చేయాలి.

### దోమలు, విషజంతువుల పట్ల జాగ్రత్త

ఇళ్ల చుట్టూ నీరు నిల్వ ఉండకుండా చూడాలి. కూలర్లు, పాత టైర్లు, కుండీలు, ఖాళీ డబ్బాల్లో నిల్వ నీటిని తొలగించాలి. దోమతెరలు, దోమల నివారణ పరికరాలు ఉపయోగించాలి. భారీ వర్షాల సమయంలో పాములు, తేళ్లు వంటి విషజంతువులు ఇళ్లలోకి వచ్చే అవకాశం ఉంటుంది. ఇంటి మూలలు, నిల్వ గదులు, నీరు చేరిన ప్రదేశాల్లో జాగ్రత్తగా ఉండాలి. పాము లేదా తేలు కాటు పడితే మంత్రాలు, మూఢనమ్మకాలను ఆశ్రయించకుండా వెంటనే సమీప ఆసుపత్రికి వెళ్లాలి.

### అధికారుల సూచనలను పాటించడం అందరి బాధ్యత

భారత వాతావరణ శాఖ, జిల్లా యంత్రాంగం, రెవెన్యూ, పోలీసు, మున్సిపల్, ఆరోగ్య శాఖలు జారీ చేసే హెచ్చరికలను నిర్లక్ష్యం చేయకూడదు. సోషల్ మీడియాలో వచ్చే నిర్ధారణ లేని సమాచారాన్ని నమ్మరాదు. అత్యవసర పరిస్థితుల్లో హెల్ప్‌లైన్ నంబర్లకు వెంటనే సమాచారం ఇవ్వాలి. మురుగునీరు నిల్వ కాకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి పౌరుడి బాధ్యత.

### అప్రమత్తతే ప్రాణాలకు రక్షాకవచం

భారీ వర్షాలను ఆపడం ఎవరి వల్లా కాదు. కానీ వాటి వల్ల కలిగే ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించడం మాత్రం ప్రతి ఒక్కరి చేతుల్లోనే ఉంది. ప్రభుత్వ అధికారులు, వైద్యాధికారులు ఇచ్చే సూచనలను పాటించడం, కాచిన వేడి నీళ్లు తాగడం, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వడం, దోమలు పెరగకుండా చర్యలు తీసుకోవడం, విషజంతువుల పట్ల అప్రమత్తంగా ఉండడం, అత్యవసర కిట్ సిద్ధంగా ఉంచుకోవడం, అవసరం లేకుండా బయటకు వెళ్లకపోవడం ద్వారా వర్షాకాలాన్ని సురక్షితంగా ఎదుర్కోవచ్చు. ఒక్క నిర్లక్ష్యం ప్రాణాపాయానికి దారితీయొచ్చు... ఒక్క అప్రమత్తత అనేక ప్రాణాలను కాపాడుతుంది.



**-శ్రీశైలం దూదం**
9133947176

పుస్తక సమీక్ష

# మంచి నీతి, సందేశం ఇచ్చే కథలు




**ప్రతులకు:** సి.రాధిక,
ఇ.నెం.4-1042/4, గాయత్రీనగర్
గ్రీమ్‌సపేట్, చిత్తూరు517 002
సెల్: 94923 78422

సి.ఎస్. చంద్రశేఖర్ (చిత్తూరు నారాయణరావు చంద్రశేఖర్) నెల్లూరు వాసి. తలిదండ్రుల మాతృభాష మరాఠి. అయినా వారి పుత్రుడు పెరిగిన గడ్డపై మమకారం పెంచుకున్నారు. తెలుగు భాషలోని తీయందనాన్ని ఉగ్గుపాల, వయస్సులోనే ఆస్వాదించటం నేర్చుకున్నారు. రెండు వందలపై చిలుకు కథలు, 3 నవలలు తెలుగు పత్రికల ద్వారా అందించి ప్రశంసలు, పురస్కారాలు అందుకున్నారు. వీరు కవితలు కూడా రాస్తారు. వీరి కథలు కొన్ని తమిళంలోకి అనువదించబడ్డాయి. ఎం.ఫిల్ మరియు పి.హెచ్.డి చేయటానికి కావల్సినంత సత్తా వీరి రచనల్లో ఉండటం విశేషం! మానవ జీవిత కార్యకలాపాలన్నింటికీ "నెర్వ్ సెంటర్" అనదగిన ఫైనా న్సు విభాగంలో నిష్ణాతత, తన బ్యాంక్ ఉద్యోగంతో అలవరుచుకున్నారు.

జీవితంలో ఎదురయ్యే సంక్లిష్ట ఘట్టాలకు తన ఆలోచనా పరిణతితో 'ట్విస్టు' ఇచ్చి, పాఠకులకు 'పరిణామం' అందీ, అందనట్లు ఉంచుతూ కథను కొన సాగించే చతురత అలవర్చుకున్నారు చంద్రశేఖర్‌గారు. తన చుట్టూ ఉన్న పరిసరాలను ప్రజలను, పరిశీలించి తన కథా వస్తువుగా చేసుకుంటారు. ఎదుటి ప్రపంచాన్నే కాకుండా, తన అను భవాలను కూడా కథలో పొదగటం వల్ల వీరి కథలు సహజంగా సాగుతాయి. ఎక్కడా నేల విడిచిన సాము కనిపించక పోవటం, సహజత్వం, సారళ్యత వీరికి మంచి పేరు తెచ్చినదన వచ్చును.

బీదరికంతో వచ్చిన నిజాయితీ, కష్టపడేతత్త్వం మానవ సంబంధాల మహితత్త్వం, కృతజ్ఞత, మాతృప్రేమ, క్షమా గుణం ఇవన్నీ చంద్రశేఖర్‌గారి కథా వస్తువుల్లో మంచి గుణాలు. ఈ కథలు చదివి పాఠకులు అలవరుచుకోవలసిన మంచి లక్షణాలు. పేదరికం, పేదరికంతో వచ్చిన ఆత్మన్యూనతా భావం, పట్టుదల, కష్టపడే చంద్రంకు అబ్బిన గుణాలు. సంపద, దాంతో వచ్చిన దుర్గుణాలు, ఇతరులను తత్త్వం గెలిచేసీ మాట్లాడటం, అవమానించటం, సంపన్నుడైన ప్రకాశ్ లక్షణాలు. శిరీషకు చంద్రం అంటే ఇష్టం. విద్యార్థి దశ తరువాత చంద్రం శిరీషలు దంపతులవుతారు. చివరన చంద్రం దంపతులు ప్రకాశ్‌ను ఆదుకుంటారు. తనపట్ల విద్యార్థి దశలో ప్రకాశ్ చేసిన అవమానాలను విస్మరించి క్షమాగుణం చూపటం, కథలోని నీతి (మంచి మనసుకు మంచి రోజులు).

**'అంజలిదే గొనుమా'** అన్న టైటిల్ కథ రచయిద తన ఉద్యోగానుభవంతో రాసా రనుకుంటాను. సహజంగా ఉంది.

మంచి సందేశం ఉంది. బ్యాంకు ఉద్యోగులకు కష్టమర్ల మనఃస్తత్వం అంచనావేసే అనుభవం అలవరచుకుంటారు. అట్లాంటి అనుభంతో కృష్ణ అనే బ్యాంకు ఉద్యోగి జయశ్రీ అన్న బీద యువతికి లోను సాంక్షను చేసి సాయపడితే, ఆమె అంచెలం చెలుగా ఎదిగి, మంచి స్థితిమం తురాలై కృష్ణను ఆయన కష్టంలో ఆదుకుం టుంది. నీళ్ళు నిండిన కళ్ళలో కృష్ణ ప్రకటించిన కృతజ్ఞతాభావం **'అంజలిదు గొనుమా!'** ప్రథమ పురుషలో వ్రాయటం వల్ల కథకు సినిమా చూసినంత **'దృశ్యత'** ను చేకూర్చారు రచయిత.

కొడుకు తల్లియెడ చూపిన తిరస్కారాన్ని లెక్కచేయక తల్లి ప్రమీల కొడుకు వినోద్‌ను కరోనా కష్ట సమయాన ఆదుకుంటుంది. **'మాతృదేవోభవ'** కథలో. అందుకే అంటారు తల్లిని **'ప్రత్యక్షదైవం'** అని. మంచి సందేశం ఇచ్చే కథ ఇది.

ప్రియుడు మోసం చేసి నగలతో పరారవుతాడు **కర్మఫలం** కథలో. నిలద్రొక్కుకున్న సౌందర్య ఆ మోసగాణ్ణే, డాక్టరుగా ఆదు కుంటుంది మోసం చేసిన **'కర్మ ఫలం'** సుందర్ అనుభవంచక తప్పదు అన్న సందేశం ఈ కథ ఇస్తుంది. చంద్రశేఖర్‌గారు చిన్న కథలు (పేజీ మించని) కార్డు కథలు వ్రాయటంలోనూ ప్ర'సిద్ధ'హస్తుడే అనుకుంటాము. **'అమ్మ నిర్ణయం' 'ముఖాలు చూసుకుందాం', 'తల్లి ప్రేమ'** లాంటి బుల్లి కథలు చదివాక.

మంచి నీతి, ఉదాత్త సందేశాలు ఇచ్చే కథలివి. రచయితకు అభినందనలు.



**-కూర చిదంబరం**
సెల్: 8639338675

## దేశము-జాతిపిత సందేశము!

మోహన్ దాస్ నీవన శమ
దోహద మంత్రంబు! వెలుగు తూర్పు కిరణమున్!
లోహ మనస్కుల కరిగిం
చే హాసన విభ! శాంతి సేనాగ్రణియున్ !.

నీవే ధర్మము! సత్యము!
నీవే హింసాగ్ని నార్పు నెమ్మి హిమమున్ !
నీవే మమతా తత్త్వము!
నీవే సత్యాగ్రహ పథ నిగ్గు ధ్వజమున్ !.

ఒడలున మాంస రుధిరముల
నడయాడిన దివ్య మూర్తి! నరజాతికి శాం
తి ధమరు! నవతా దీప్తి!న
రుడవే నీవు! కరుణా స్వరూపము జూడన్ !.

నియమము పాలన జేయుచు
భయ సంశయములను వీడి బ్రదుకుచు, దివ్యా
శయములకున్ కృషి సలుపుచు
స్వయము సహాయకుడ వగుచు సాగితి వీవున్ !
సత్యము ప్రేమమ హింసయు
కృత్యములెల్లను సమయముకే జేయుటయున్
అత్యధిక దేశ భక్తియు
జాత్యౌద్ధత్య నిరసనయు చాటితి వీవున్ !

పాతకముల నిరసించుచు
ఘాతుక మత మౌఢ్య భావ కర్మలు విడుచున్
నూతన మార్గము జనుమని
జాతిపితా ! దెలిపినావు ! సందేశముగన్ !

ఏ దేశము నడయాడిన
నీదగు సందేశమునను , నీమార్గమునన్
పోదే క్లేశము! దుఃఖము!
రాదే కృత యుగము ! రామ రాజ్యంబిలకున్ !

ఏ దేశము నడుచునో నీ
ఆదేశము మేర యదియె యమర నిలయమై
ఖేద విముక్తయయి సదా
మోద సుధర్మ శుభ సత్య మూర్తిగ వెలయున్ !

బ్రాందీ షాపులు మూయుట
మందీ మార్బలము తోడ "మార్చ్" జరుపుట కా
దెందున్ సత్యము పలుకుట
నందరినొకరీతి జూచుటంజలి నీకున్ !

అహమును పక్కకు నెట్టుచు
కుహనా సంకల్పములను క్రోధోద్ధతులన్
దహనము జేసెడి వ్రతమున్
మహాత్మ !
మాకిడుమయ! పరమార్థంబరయన్ !



**-కె.కౌండిన్య తిలక్**
8790920745

## సంభవం..

పాలచుక్కల కమ్మదనంలో
పూలరెక్కల పరిమళంలో
స్వచ్ఛతా శాతం తగ్గి.. కృత్రిమత పెరిగింది
లాభాపేక్షా కలుపు బలపడంతో!.
అనాది కట్టుబాట్ల లక్ష్మణ రేఖల్లో
పెనవేసుకున్న బంధాల బాధ్యతల్లో
పూర్ణత లోపించి.. తెగిన గాలిపటాల్లా
వర్తిస్తున్నారు జనం.. స్వేచ్ఛ పేరుతో!.
నమ్మకపు పునాదుల గట్టిదనంలో
ఆత్మలోతుల్లోంచి ఉబకాల్సిన పశ్చాత్తాపంలో
పటిష్టత నాసిగిల్లి.. అవి పెదవులపై
పొటమరించిన పొల్లు అవుతున్నాయి..
నిబద్ధతా క్షీణతతో!
మనుష్యుల మధ్య ఉండాల్సిన మమకార సహకారాల్లో
మానవ తాత్వాల సంపూర్ణ ఆచరణలో
సాంద్రత పలుచనై.. ఉనికి నామ మాత్రమయ్యింది
స్వార్థమే అనేకుల పరమార్థ మవడంతో!
మర్యాద ఉట్టిపడే పలకరింపుల్లో
మార్దవం నిండిన మాటల మాధుర్యంలో
ఆత్మీయత కొరవడి..
అతిశయపు ముళ్ల తీగల్లలుకుంటున్నాయి
ఆత్మ స్పందనలపై ఐస్వర్యానిదే పైచేయి కావడంతో!
సహజ మానవధర్మాల నాచరిస్తే.. లోటుపాట్లు పూర్ణం
స్వీయ నియంత్రణ అలవడితే..
మనోవికారాలు మాయం
సమాజహిత భావన మదిలో ఉంటే..
ప్రేమ, క్షమ లు సొంతం
సహనం వీడక ఎదురుచూస్తే..
సానుకూలతలు సంభవం!



**- షేక్ కాశింబి**
90522 16044

## ఏ చదువు లెందుకు?

తోటి మానవుని ప్రేమించకుంటే అంధవిశ్వాసాలు
మనిషన్నవాడిని మాయం చేస్తుంటే
మోక్ష మార్గాలతో ఒరిగేది ఏముంది ?
యువతలో హింస పెట్రేగి పోతుంటే
జీవం పోసే ప్రకృతిని కొల్లగొడుతుంటే
కూర్చున్న కొమ్మనే నరుకుతుంటే
ఋతువులు గతులు తప్పుతుంటే
విజ్ఞాన స్పృహ లేని చదువు లెందుకు ?
విశ్వవిద్యాలయాల పట్టా లెందుకు ?
భారత రత్న ,నోబుల్ ప్రైజ్ ,
గ్రహీత ల గౌరవాలెందుకు ?
శాంతి లేని సిరులు సౌఖ్యాలెందుకు ?
నోటుకు ఓటు అమ్ముడు పోతే
నేరస్థులు చట్టసభలకు ఎన్నికైతే
రాజ్యాంగాన్ని వెంటిలేటర్ పై ఎక్కిస్తే
ప్రజాస్వామ్య పునాదులు కదలిస్తే
ప్రజా సంక్షేమం తొక్కిసలాటలో నలిగిపోతుంటే
మతం ముసిగేసిన పాలకులెందుకు?
సామాన్యుడు బతికి బట్టకట్టలేని హైటెక్
అభివృద్ధి తిరోగమనం
చదువులలో శాస్త్రీయ దృక్పథము
మానవవాదం మే పురోగమనం



**-పూసాల సత్యనారాయణ**
9000792400

# సాధు స్వభావం



## కవితార్చన

అడ్మిన్: డా॥రాధాకుసుమ
సెల్:99892 41319

"కుసుమ ధర్మన్న కళా పీఠం" సంస్థ ప్రతిరోజు కవిత్వ రచన చేయిస్తుంది. అందులో ముఖ్యమైన కొన్ని కవితలను నేటినిజం పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం..

విశాల గగనం లో
ద్వేషపు తారలు ఎన్నో
జాబిలమ్మ మాత్రం
చిరునవ్వుల వెన్నెలనే పంచుతూ
సమాధానమిస్తుంది...!
ఎందరేమన్నా,ఎవ్వరేమనుకున్నా
నీ నిస్వార్థ నిరపేక్షిత నిస్సంకుచిత
సముచిత నిరాడంబర కృషి ఎనలేనిది సాటిలేనిది.
నీ విషాల సామ్రాజ్యములో కీచురాళ్ళెన్నో
అయినా నిశ్శబ్దంగా నీవంతుగా కర్తవ్యాన్ని
నెరవేరుస్తూ సాగిపోతావు ఠీవిగా, రాచరికం ఉట్టిపడగా.
నీ భావోద్వేగాలకు తావులేకుండా సమయం కూడా నీకు సహకరించగా,
చిరునవ్వుల చిందిస్తూ ముందుకు సాగే
నీ వెన్నెల కాంతి అనిర్వచనీయం.
మనిషి మారాడు కాలాన్ని మార్చాడు
నీవు మారలేదు నీవు మార్పు కోరుకోలేదు
విధిని ధిక్కరించలేదు.
నిందలు మోసావు నిందించినవారిని మోసావు.
ఆటు పోట్లు,మాటల తూటాలు,
ద్వేషపు తారలు నీ గుండెను చీల్చి చెండాడినా,
రక్తం ఏరులై పారినా,నిశ్శబ్దంగా రోదించి ఉంటావు,
మేఘాలతో దోబోచులాడుతూ
కదిలిపోయే జాబిలి నీకు సాటి ఎవ్వరు

–పొబ్బతి గీతా శ్రీనివాస్
99510 21535

## తల్లికి అందరూ తల్లులే

విశాల గగనంలో ద్వేషపు తారలెన్నో
జాబిలమ్మ మాత్రం చిరునవ్వుల
వెన్నెలనే
పంచుతూ సమాధానం ఇస్తుంది...
ధరణి గర్భములో పురుడు పోసుకున్న
పాప పుణ్యులెందరో
పేరు ప్రఖ్యాతిగాంచిన
మహనీయులను చూసి గర్వపడిన తల్లి...
గర్భానికి గాయాలను చేసి జీవిస్తున్న బిడ్డలను చూసి
మౌనంగానే రోదిస్తూ చిరునవ్వులు చిందిస్తుంది...
బుద్ధికి బూజు పట్టుకొని, మనసును మలినంలో ముంచుకుని
వెంట తిరిగే స్వార్థపరులను, నిజమెరిగిన
స్వాగతించాలి, నేతిబువ్వ పెట్టి మర్యాదలు చేయాలి...
తప్పదు మరి, బుద్ధి ఎరుగక కలుపుకున్న బంధం
చేయాలి స్నేహం, చిరునవ్వులతో కడగాలి మలినం
పల్లేరు గాయాల పానుపు పైన పవళించాలి
చెడును తరిమే వరకు మంచిని మది నింపుకొని
తన, మన బేధం లేదు స్వార్థానికి...
నేల తల్లికి అందరూ ఒక్కటే, మంచి చెడును
పెంచి పోషించాలి తప్పక, కడుపు తెరుచుకొని
కన్నది కనుక, మళ్లీ తన ఒడికి చేరే వరకు భరించాలి
తప్పక, చిరునవ్వులు చెదరకుండా...

–పొన్నాల ధనమ్మ వెంకటరెడ్డి
+91 92460 61993



తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ ప్రతి వారం 'జూమ్'లో నిర్వహిస్తున్న "సోమవారం కవిసమ్మేళనం – కవివారం'లో కవులు పాల్గొని చదివిన కొన్నికవితలను నేటినిజం పాఠకుల కోసం..

నిర్వహణ
–కందుకూరి శ్రీరాములు
–బెల్లంకొండ సంపత్ కుమార్
–సంపాదకులు

## బంధాలు

ఈ బంధాలు ఎక్కడున్నయో
ఈ అనుబంధాలేమయ్యాయో ఏమో
ఏ భూగర్భంలో సమాధి అయ్యాయో
అందుకే భూతద్దంపెట్టి వెతికినా
వాటి జాడ దొరకట్లేదు.
ఒకప్పుడు
తల్లిబిడ్డల సంబధమైనా
అక్కాచెల్లెళ్ల ఆనుబంధమైనా
అత్తామామల సంబంధమైన
వజ్రమంత గట్టిగా ఉండేవి
కానిప్పుడేమో ఇరుస్తే ఇరిగిపోయే
కట్టెపుల్లలయ్యాయి
తెంపేస్తే తెగిపోయే తాళ్ళయ్యాయి
ఇంకా ఎక్కడున్నయి ఈ బంధాలు.
అప్పుడు వీథిలున్నోళ్ళంత ఇంట్లోళ్ళు
కాకపోయినా
అందరు ఇంటికొచ్చే చుట్టాలే
పెద్దమ్మలు – పెదనాయనలే
,మామలు అత్తలే
కానిప్పుడు ఆ పదాలు
ఎడారిలోని నీళ్ళలా ఆవిరైపోయాయి
ఆంటీబిఅంకుల్ పదాల్లో తడిలేక
బంధాలు బీటలు వారుతున్నాయి
ఇంకా
ఈ బంధాలెక్కడ, అనుబంధాలెక్కడ
ఆ బంధాలన్నీ కలికాలం రాగానే
స్వార్థపుకొలిమిలో పడి
కాలిపోయాయనుకుంటా
అందుకే వీటి కోసం ఎంత
వెతుకులాడినా
కంటికి కనబడడం లేదు
ఎప్పటికైనా బంధాలు పచ్చగుంటేనే
లోకం పచ్చగుంటుంది
అనుబంధాలు తడిగా ఉంటేనే
అందరి పెదాలపై చిరునవ్వు
పువ్వైపూస్తుంది

– పి.భవ్య శ్రీ

## బురద

శవాలింకా బురదలోనే ఉన్నాయి
ఒక శవం చేయిలేపింది
మరో శవం తల కిందకు
వేళాడేసింది
బురదలోంచి బయటపడుతున్న
శవాలపై
కన్నీటి వర్షం
ఇంకా కురుస్తూనే ఉంది.
ఇంటికొస్తానని చెప్పిన వాళ్ళ నోట్లో
బురద
చేయందించేవారి చేతిలో బురద
నేడక నేర్పినవారి కాళ్ళపై బురద
మొత్తంగా తమవారికోసం
ఎదురుచూసే వారి ఆశలపై బురద.
ఎలాంటి హెచ్చరికల్లేవు
ఎలాంటి సంకేతాలు లేవు
క్షణాల్లో ప్రాణాలపై
ప్రకృతి బురదజల్లింది.
క్షణక్షణానికో గుండె కోత
గంట గంటకో శవాలకుప్ప
శవాలకు ప్రాణాలొచ్చాయ్
బురదను కప్పుకున్న శవాలు
తనకు తెలియకుండానే
ఐనవాళ్ళముఖానికి
బురదజల్లుతున్నాయి
నిజానికి ప్రకృతిపై మనంచల్లుతున్న
బురద కంటే
ప్రకృతి మనపై చల్లుతున్న బురద
తక్కువే.

– ఎన్.నరేశ్ చారి

## వాక్ శక్తి

ఆదిమకాలం నుండి
చినుకు చినుకుగా మొదలైంది మాట
మాట పువ్వులా విచ్చుకొని
అయ్యింది పాట.
కొన్ని విలువైన మాటలు కలిస్తే వచ్చే
పాట
ప్రపంచాన్ని కదిలించగలదు
కనుమరుగూ చేయగలదు.
మనిషికి ఉన్న గొప్ప శక్తి వాక్ శక్తి
మనిషికి మనిషికి వ్యత్యాసం చూపేది
మనసులో భావాలను
మధురంగా
బయటకు వ్యక్తపరిచేది.
వాక్ శక్తితో
విలువలేనివాణ్ణి కూడా
విలువైన వజ్రంగా మార్చవచ్చు
వాక్కుకున్న శక్తి తెలుసుకో
విలువగల వ్యక్తిగా
నిన్ను నిలుపుతుంది
వికాసం నీలో నింపుతుంది.
వాక్ శక్తి నీ ఆయుధమైతే
మనుషులను గెలవవచ్చు
మనసులనూ గెలవవచ్చు.

– అందోల్ అక్షయ

# అవ్వా నువు రావాలె! (కథ)



అవ్వా! నువు యాడున్నవో గని బాగ యాదికత్తున్నవ్. నువు బతికున్నప్పుడు గీ సంగతి సెప్పకపోతినని అఫ్సోస్ ఐతున్నది. క్యాన్సర్ తోని లడాయి సేత్తున్న నీకు తక్లిఫ్ ఏంటికి ఇయ్యాలని సెప్పలేదు. అంతట్ల నువ్వు దేవుని దగ్గరికి పోతివి. ఇప్పుడు ఓల్లకు సెప్పాలె? ఓల్లు మాకు దైర్యం జెపుతరు? ఎంతో గార్వంగ పెంచిన మా ఒక్కగా నొక్క బిడ్డె దీప్తి, మాకు గాకుంట పోతున్నది. తలవంపులు దెత్తున్నది. మేమెంత జెప్పినా ఇంట లేదు, ఇప్పుడు బొందల వడ్డంక మేమేం జేయాలె? మంది ముందట మమ్ముల ను తలకాయ దించుకుండెటట్టు జేసె.

గిట్ల అంటె నీకేం అర్తమైతది గని, గొంత ఇవరంగ జెపుత. మా బుజ్జి దీప్తి, సదుల ఎంత ఉషారుండెనో నీ కెర్కనే. సిన్నప్పటి సంది అదంటె నీకు శాన కుతి. దానికి గూడా నువ్వంటె ఎంతో ప్రేమ. ఒక్కొక్కప్పుడు మా మాట అంటే కదర్ వెట్టేది గాదు గని, నువు జెప్పితే యెంటనే ఇనేది. నువ్వు జెప్పె కతలకు సెవి కోసుకునేది. మీ ఇద్దరిది సక్కని జోడి. దాన్ని నువ్వు ఎంతో ప్రేమగసూత్తుంటివంటే అది నీ దగ్గరికత్తె, మా దిక్కు సూడకనే పోతుండె. మల్ల మా ఇంటికి రానని మొండికేత్తుండె.

మా ఒక్కగా నొక్క బిడ్డెను ఇంజనీర్ సేపియ్యుమని నువ్వంటె, దాన్ని గంత దాక సదిపిచ్చిన. సదు ఐపోక ముందే దానికి కాలేజీ ఇంటర్వ్యూ ల మంచి కంపెన్ల పెద్ద జీతం తోని సాఫ్ట్ వేర్ కొలువచ్చె. గప్పుడు నువ్వెంతో ఖుశీ ఐతివి. మాకు గుడా సంబురమాయె. ఇగ లగ్గం జేద్దమంటె ఇనక పాయె. రొండేండ్లు నౌకిరి జేసినంకలగ్గం జేసుకుంటా అనె. నువ్వు గుడా ఎంత సముజాయించినా గాని ఇనక పాయె. సరె అని ఊకుంటిమి. గదే మా కొంప ముంచింది.

ఆల్ల కంపిన్ల గదెదో యచ్ ఆర్ ఏడ్ అట. నౌకర్లకు వెరే వేరే దిపార్మెంట్లకు పంపిచ్చుడు, ఆల్ల సౌలతులు, రజలు(సెలవులు), పగార్లు (జీతాలు) గవన్ని సూసేటామె, మా బుజ్జిని మంచిగ సూసుకున్నదట. మా బుజ్జినే గాదు, ఇంక ఆల్ల ఆపీసుల పనిజేసే ఆడోల్లందరిని గూడా తన సెల్లెండ్ల లెక్క సూసుకునేదట. అవన్ని మాకు ఎంతో ఖుశీగ జెప్పుతుండె. మాకు గుడా మంచిగనిపించింది. ఆమె మంచి తనం యెనుక ఎంత పెద్ద కుట్ర ఉండెనో, మా బుజ్జి మా సేతులు దాటినంక తెలిసింది. దిన దినానికి అది మా తోని గుడికి అచ్చుడు బందు జేసింది. తన రూముల గొలుసు వెట్టుకొని, ఏమో ఏమో మంత్రాలు సదుతుండె. ఒకసారి మీాము బారీ(కిటికీ)ల కెల్లి సూత్తె తలకు బట్ట గట్టుకొని, మోకాల్లమీద కూసొని పెదులాడిత్తున్నది. మాకేం అర్తం కాలే. తలుపులు బందువెట్టి ఏం జేత్తున్నవంటే సప్పుడు జేయక పాయె. గప్పుడు మేమంత పట్టిచ్చుకోలే.

గొన్ని నెలలయినంక తను ఒకన్ని ప్రేమిత్తున్న, అయిననే లగ్గం జేసుకుంట అని సెప్పె. మా నెత్తి మీద పెద్ద బండ పడినట్టయింది. ఆయ నోల్లు మనోల్లేనా అని అడిగితే, కాదు తురుకాయన అని సెప్పె. మాకు సల్లగ సెముటలచ్చినయ్. ఉండి ఉండి గా తురుకోడే దొరికిండా అని బాగ కోప పడ్డం. ఏడ్సినం. "నీకు మనోల్లం లమంచి పిల్లగాన్ని సూత్తమని" నముజాయించినం. ఐనా మా మాటలు సెవికెక్కించుకోలే. ఆయననే సేసుకుంటా అని జిద్దు జేసె. ఎట్లనో మనుసు గట్టిగ జేసుకొని "మరి ఆయన ఏం సదిండు? ఏం పని జేత్తడు? ఆల్లు యాడ ఉంటరు? ఆల్ల కుటుంబం చరిత్ర ఏంది?" అని అడిగితిమి.

"ఆయిన ఓలా కార్ డ్రైవర్. యాడాది సంది (నుంచి) నన్ను రోజు ఆపీసుకు తీసుకపోయి తీసుకత్తున్నడు. ఆల్లు పాత బస్తిల ఒక గుడిసెల ఉంటరు" అని సెప్పె. అది ఇని మా నవనాడులు గుంజుకపోయినయ్. ఇంజినీర్ సదు సది, లక్ష రూపాల నెల జీతపురాలు, గా కార్ డ్రైవర్ ను లగ్గం సేసుకుంటానంటే మా మనసులు ఎంత బాద పడ్డయో నువ్వు అర్తం జేసుకో. దీప్తిని సముదాయించుమని, గా సంగతి నీకు సెప్పుదమంటె నువ్వు మన ఊర్లెనే క్యాన్సర్ కు ఆయుర్వేద ఇలాజ్ దీసుకునవడ్తివి. వాట్సాప్ ల మెసేజ్ పంపుదమంటె నీకు సెల్ ఫోన్ లేదాయె. రెన్నెల్లు ఇంట్ల ఒక లడాయే నడిసింది. మేము అసలే ఒప్పుకోలేదు.

అంతట్ల నువ్వు సచ్చిన సంగతి తెలిసె.మేము మనూరికత్తిమి. పన్నెండు దినాలు, నెలలోపలనే అన్ని నెలలకు తిథులు వెట్టి మా ఇంటికచ్చె వరకు గొన్ని కొత్త సంగతులు బయటవడె.

దీప్తి యెచ్. ఆర్. ఎడ్. తురుకామె. గామె కంపిన్ల పనిజేసే ఆడోల్లందని ఆల్ల మతం మంచిదని, ఆల్లకు సెప్పి, సెప్పి, మెదడు కరాబు జేసిందట. కంపిన్లనే నమాజ్ సేసుడు నేర్పిందట. ఇగ ఆల్ల మతం మొగ పోరగాండ్లను, ఆడోల్లతోను కలిపించి ప్రేమల పడెటట్టు జేసింది. కొంత మంది తల్లిదండ్రులు పోలీస్ కంప్లెంట్ ఇచ్చే తాల్లకు అన్ని సంగతులు బయటవడె. గా తురుక ముండ, దాని తురుక సోపతోల్లు కంపిండ్ల పనిజేసే ఆడోల్లను కుట్రతోని, గదేదో లవ్ జిహాద్ల ఇరికించిండ్లు. తిండిల మందు వెట్టి, ఆల్లు సెప్పినట్టు ఇనేటట్టు సేసినటున్నరు.

గందుకనే మా దీప్తి, దానితోని పనిజేసే ఆడోల్లు, తురుక పోరగాండ్ల మాయల పడ్డరు. మేమెంత జెప్పినా ఇనలేదు. గా సంగతులన్ని పేపర్ల అచ్చెతాల్లకు మాకు అసలు విషయం తెలిసింది. గా తురుకదాన్ని, దాని సోపతిగాల్లను అరెస్టు జేసి ఇశారిస్తున్నరు. మా దీప్తికి ఇంకా సోయి రాలేదు. గా ఓల డ్రైవర్ పాటనే పాడుతున్నది. మాతోని మాటలు బందు జేసింది. ముంగి లెక్క ఉంటున్నది. నువ్వు ఉంటే నీ మాటన్న ఇంటుండెనెమో? నువ్వు ఓల్లన్న మంత్రగాన్ని తోలుకచ్చి, దాన్ని పట్టుకున్న దయ్యాన్ని దించిపిత్తుంటివి. ఏ మందో మాకో దెచ్చి, గా తురు కోల్లు పెట్టిన మాయ మందు కక్కిత్తుంటివి. నువ్వు తప్పితే మాకు వోల్లు లేరు.

నువ్వు గూడా దేవుని దగ్గెరికి పోతివి. ఇగ మేమోల్ల దిక్కు జూడాలె? మా బిడ్డె మాకు ఎట్ల దక్కాలె? ఎటూ తోస్తలేదు. గందుకే అవ్వా! నువ్వు రావాలె. నువ్వు రావాలె. అవ్వా! నువ్వు రావాలె. అవ్వా! నువ్వు రావాలె.

తెలంగాణలో నాతో సహా కొందరు, తమ అమ్మను "అవ్వా" అని పిలుస్తారు.



–అంబల్ల జనార్దన్
సెల్:09987533225

# భవిష్యత్తుకు జీవనాధారం.. "వెదురు జీవనరాగం"

మానవ నాగరికత ప్రకృతి ఒడిలో పురుడు పోసుకుంది. ప్రకృతి లోని ప్రతి వనరూ మానవ జీవనానికి ఏదో ఒక రూపంలో తోడ్పడుతూనే ఉంది. అలాంటి ప్రకృతి ప్రసాదించిన అపూర్వమైన వనరుల్లో వెదురు ఒకటి.అందుబాటులో ఉండటం, అనేక అవసరాలకు ఉపయోగపడటం, చౌకగా దొరకడం వల్ల వెదురును పేదవాడి కలప అన్నారు.ప్రపంచం సుస్థిర అభివృద్ధి వైపు అడుగులు వేయాలంటే పర్యావరణానికి హాని కలిగించని వెదురు వస్తువులు వాడాలని, వెదురు ప్రాధాన్యాన్ని ప్రపంచానికి తెలియజేయాలనే ఉద్దేశ్యంతో ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 18న ప్రపంచ వెదురు దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ప్రపంచ వెదురు సంస్థ (World Bamboo Organization) ఆధ్వర్యంలో 2009 నుంచి ఈ దినోత్సవం ద్వారా వెదురు యొక్క పర్యావరణ, ఆర్థిక, సామాజిక ప్రాధాన్యంపై అవగాహన కల్పిస్తున్నారు. 2026 సంవత్సరానికి ఈ సంస్థ a| ˜mboo Beyond Boarders" అనే ఇతివృత్తంతో వెదురు దినోత్సవం జరపనుంది .ఇందులో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ నగరంలోని రవీంద్ర భారతిలో వెదురు బొంగుల దినోత్సవాన్ని జరపడం అభినందనీయం. తెలంగాణ రాష్ట్రంలో దాదాపు రెండు లక్షల మంది ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా వెదురునే జీవనాధారంగా చేసుకుని జీవనం గడుపుతు న్నారు. ముఖ్యంగా మేదరి కులస్థులు వెదురును ఆధారంగా చేసుకొని తడుకలు ,గంపలు, బుట్టలు, చాటలు, సిబ్బులు, చంద్రికలు, పొనుకలు, విసనకర్రలు వంటి అనేక వస్తువులను తయారు చేస్తారు.శిశువు పుట్టినపుడు "చాట"లో వేయడం నుండి మరణించినపుడు శవాన్ని మోసే "పాడె"వరకు మనిషి జీవన చక్రంలో వెదురు అంతర్భాగమైంది.వెదురు పర్యావరణ పరిరక్షణలోనూ కీలక పాత్ర పోషిసుంది. నేల కోతను అరికట్టడంలో, పచ్చదనాన్ని పెంచడంలో, కాలుష్యాన్ని అరికట్టడంలో ఇది ఉపయోగపడుతుంది. వెదురు ఆకులు పశుగ్రాసంగా కూడా ఉపయోగపడతాయి. అందుకే వెదురును "పచ్చ బంగారం" అని అభివర్ణిస్తారు.

గృహోపకరణ వస్తువులే కాకుండా ,కాగితం తయారీకి అవసరమైన గుజ్జును తయారు చేయడంలోనూ వెదురును ఉపయోగిస్తారు. కొన్ని ప్రాంతాల్లో వెదురు చిగుళ్లను ,వెదురు గింజలను ఆహారంగా కూడా ఉపయోగిస్తారు. ఆయుర్వేదం, సంప్రదాయ వైద్యంలోనూ వెదురుకు స్థానం ఉంది.సంగీత ప్రపంచంలో వెదురుకు ఉన్న ప్రాధాన్యం మరింత ప్రత్యేకమైనది. సప్తస్వరాలను పలికించే వేణువుతో పాటు వివిధ సంప్రదాయ వాయిద్య పరికరాల తయారీలోనూ వెదురును ఉపయోగిస్తారు. వెదురు మానవ జీవితానికే కాదు మనిషి భావోద్వేగాలకు , కళలకు ,జీవనరాగానికి కూడా తోడుగా నిలిచింది.

నేటి ఆధునిక కాలంలో ప్లాస్టిక్ మరియు లోహ ఆధారిత వస్తువుల వాడకం వల్ల వెదురు వస్తువుల వాడకం తగ్గింది .ఇదే సమయంలో వెదురు లభ్యత కూడా సమస్యగా మారింది. అడవుల క్షీణత,వెదురు బొంగుల సేకరణపై పరిమితులు, వివిధ చట్టపరమైన ఆంక్షలు వెదురుపై ఆధారపడిన కుటుంబాల జీవనాన్ని మరింత సంక్లిష్టం చేశాయి.అందుకే చాలా మంది ఈ వృత్తికి దూరమయ్యారు.ప్రభుత్వాలు వెదురు పెంపకాన్ని ప్రోత్సహించి, వెదురు వృత్తి కళాకారులకు నాణ్యమైన వెదురును అందుబాటులోకి తెస్తే ఈ వృత్తికి పునరుజ్జీవం ఇవ్వవచ్చు.

తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న వెదురు బొంగుల దినోత్సవం వెదురు వృత్తి దారుల కుటుంబాల జీవితాల్లో మార్పు తీసుకుని వచ్చే అవకాశం ఉందని వెదురు వృత్తి దారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు .ప్రభుత్వ భూములు, పాడుబడిన భూములు, రైతుల పొలాల అంచులు, సామాజిక అటవీ ప్రాంతాల్లో వెదురు పెంపకాన్ని ప్రభుత్వం ప్రోత్సహించాలనీ,వెదురుపై ఆధారపడి జీవిస్తున్న మేదరి కుటుంబాలకు నాణ్యమైన వెదురు అందుబాటులో ఉంచాలని ,వారి సంప్రదాయ జీవనోపాధిని దెబ్బతీయకుండా అటవీ విధానాలను రూపొందించాలనీ అభిప్రాయపడుతున్నారు.ఆధునిక డిజైన్ శిక్షణ, ఉత్పత్తి అభివృద్ధి, ప్యాకేజింగ్, బ్రాండింగ్, ఆన్‌లైన్ మార్కెటింగ్, ఈ–కామర్స్ వంటి రంగాల్లో శిక్షణ అందించి,ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, పర్యాటక కేంద్రాలు, సాంస్కృతిక సంస్థల్లో ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా వెదురు ఉత్పత్తుల వినియోగాన్ని ప్రోత్సహించాలనీ ఆశిస్తున్నారు . తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన వెదురు బొంగుల దినోత్సవం యావత్ భారత దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఆదర్శనీయం.



–బొల్లం బాలకృష్ణ
9989735216



–డా॥రావి రంగారావు
9247581825

ఫేస్ బుక్ "అమరావతి సాహితీ మిత్రులు" గ్రూపులో డా॥ రావి రంగారావు వారం వారం సాహిత్యం వర్క్ షాపులు నిరంతరాయంగా నిర్వహిస్తున్నారు.
"ఈ వారం వచన కవితల వర్క్ షాప్" అంశం... "డీజే సౌండ్". విజేతల కవితలు చదవండి.
–సంపాదకులు

## డి.జె.సౌండు

కుర్రకారుకు విందు భోజనం,
వృద్ధులకు కర్ణ భేరిలో
పేలాల చిటపటలు,
ఇంట్లో పసి పిల్లల రోదన,
కరవ మంటే కప్పకు కోపం,
విడవ మంటే పాముకు కోపం,
ఉత్సవాల ఊరేగింపులో
డి.జె.ల తంతు...
గుడిలో కుదురుగ నిశ్శబ్దంలో ఉండే
వినాయకుడు కుర్రాడయ్యాడా?
నిమజ్జనానికి కుర్రాళ్ళను
ఎంచుకున్నాడు!
డి.జె.సౌండును విని
వృద్ధులకు ప్రసాదం
నోటి ఊటలయ్యాయి,
దేవున్ని దగ్గరగా దర్శించునే
భక్తుల కోరిక కొండెక్కుతుంది...
పక్షులు పశువులు సైతం
భూమి పగిలిందా అన్నట్లు చెవులు
ముకుళించు కుంటున్నాయి...
పిడుగు శబ్దం గుండెలదిరించేదే
కానీ...
మేఘాలను చెదరగొట్టి
ప్రాణధారను భూమికి
కానుకగా ఇస్తుంది,
డి.జె. సౌండ్ శబ్ద కాలుష్యానికి
పరాకాష్ట
ప్రజల చెవులకు ప్రళయ గర్జన,
ప్రజల జీవన దారుల్లో అవరోధం...
డి.జె.సౌండ్ వద్దు, సంగీత స్వరమే
ముద్దు.

–పగడాల వెంకటరెడ్డి
7993422614

## కాకూడదు బాడ్ బాండ్

మనసు గోడలపై సున్నితత్వం పొరలు పొరలుగా పెచ్చులూడాక,
చుట్టూ ఉన్న ప్రాణుల గూర్చిన చింతన
కొడి గట్టిన దీపంలా మసకబారాక,
సంప్రదాయాల ముసుగులో కుసంస్కారపు దిగుమతి జొరబడ్డాక,
దైవ సన్నిధి కూడా దాష్టీకాల నీడలోకి జారిపోతోంది!
ఉత్సవాలు మెలమెల్లగా అభద్రతల జాబితాలోకి చేరిపోతూ
వినోదమన్నది వికృత చేష్టల రాక్షస కేళిగా
పరిణామం చెందిన వేళ
వెర్రికుంకలు కొన్ని శ్రవణేంద్రియాలు లేని సాలమండర్లు అయ్యారిప్పుడు..!!
శ్రావ్య ధ్వనుల ప్రసారాలు కాలుష్యపు యానకాల్లో చిక్కుకున్నాక,
విందుల మత్తు ఉన్మత్తులను చేశాక,
దావత్తుల దర్జాలు వీధి ప్రదర్శనలు అయ్యాక,
ఉన్నోడి లేనోడి దాబంతా నేడు డి జె మోతలే..!!
నాటి మతపరమైన మినహాయింపుల
తిలక్ ఐక్యతా స్ఫూర్తికి పట్టిన గ్రహణం వీడాలంటే
మన ఆర్భాటపు భక్తి పొరలు తొలగించి
వెలిగించుకోవాలి సహజీవన జ్ఞాన జ్యోతులను.
ప్రశాంతంగా జీవించే హక్కును కాలరాస్తున్న
డి.జె శత్రువు గొంతు నులిమి
నియమిత డెసిబుల్స్ గల స్వరార్చనను
చందాల పుస్తకాల్లో సూచించాలి,
విధిగాబాధ్యతల మనసు మండపాల్లో
నిలబెట్టుకోవాలి సర్వుల శ్రేయస్సు కోరే భక్తి విగ్రహాలను !!

అమృతవల్లి అవధానం
9052912120

## ఓ పిచ్చి యువకుల్లారా!

చిందుల మీద చిందేసేందుకు
జాతర పేరు చెప్పుకొని
డీజే మోతను తెచ్చుకొని
కేళీ విలాస మనుకుంటిరి,
కైలాసానికే పోతుంటిరి!
ఒకవైపు ప్రళయాలు
గర్జనను గీతం చేసుకుంటూ
ఊపిరి సైతం పిసికేస్తుంటే
మరోవైపు డీజే మోతతో
కొన ఊపిరినే తీసుకుంటిరి!.
పాశవికమైన యుద్ధాలు
డాం డాం మంటూ విస్ఫోటనమై
గుండెను సైతం వణికిస్తుంటే
దడదడలాడే డిజే తెచ్చి
గుండె సడినే ఆర్పేసుకుంటిరి!.
వినాశనమైన వైపరీత్యాలు
అశాంతి బీజమై కమ్ముకు వస్తూ
భవితకే ప్రాణం ఇవ్వకుంటే
వెకిలి సౌండైన డీజే మోతతో
మీతో భవితనే తుడుపుకుంటిరి!.
ఉన్మాదపు కీటకములు
వైరస్ పురుగులై వచ్చేసి
కడుపునిండా మింగేస్తుంటే
రణ ధ్వనుల డిజే మోతతో
గుటుక్కుమంటూ మరణిస్తుంటిరి!

–చల్లా సత్యవతి
9989579662

## డీజే డబ్బా

పోలీసు సైరన్లను చెప్పుచేతల్లో బంధించి,
శాసనమై మోగుతుంది దుశ్శబ్దం అక్కడ.
చూపులన్నిటినీ తమ వైపుకు తిప్పుకునేలా,
మదపు రంకెలతో చేయి కలుపుతారు అక్కడ.
డీజే మోతల ఉధృతిలో,
తడబడుతుంది అమాయక హృదయ లయ.
చందాలు బీజం వేయగా,
తేలికగా పురుడు పోసుకొంటుంది వెర్రితనం అక్కడ.
సొంత స్వరంలో సత్తువ లేక,
అరువు మోతలతో పబ్బం గడుపుకునే గుంపు అక్కడ.
పసి పిల్లల నిద్రను చీల్చి,
వృద్ధుల గుండెల్లో భయం నింపే దౌర్జన్యం అక్కడ.
అది డీజే అడ్డా, మనసుపెట్టి వెతికినా సరాగం వినపడదు .
శబ్దాన్ని, మోతాదుకు మించి ఖర్చు పెట్టినంత మాత్రాన
గొప్పవాళ్లమైపోతామనుకుంటే అది వెర్రితనమే..
పోటీ పడాల్సింది పిడుగుల శబ్దాలతో కాదు..
ఎదుటివాడి మనసును తడిమే మంచితనంతో.
ఓ డీజే డబ్బా..
నీ కర్ణ కఠోర కేకలకు ఊరి ప్రశాంతత వణుకుతుందనుకోకు,
ప్రజల సహనం శృతి మించక ముందే
అదుపులో పెట్టుకో నీ నోరును.
డీజే దరువులు శవయాత్రలకు దారి తీయరాదు,
మృదు సంగీతపు పల్లకి సాగిన రోజున
స్వయంగా జనమే బోయీలవుతారు.

–లీలాకృష్ణ.
9949451056

## రెక్కలు తొడిగిన ధరలు

నిత్యావసరాల ధరలు
రోజురోజు పెరుగవట్టె
వంటింట ధరల మంట
ఆకాశానంటవట్టె
ధరల మోత వింటుంటె
గుండె జల్లుమనవట్టె–
చాయ్,పాలు,పంచదార
పెరుగుతున్న ధరల సూడు
ఉల్లిగడ్డ,ఎల్లిగడ్డ, వంటనూనె
ధరలు నేడు మండిపోతున్నవి
పెరుగుతున్న ధరలసూసి
చక్కర చేదెక్కింది–
కంది,మినప,పెసర పప్పులు
తారజువ్వలైపోయె
ఎండుమిర్చి పండుర్చి
కూరగాయలు కొందమంటె
మార్కెట్లో ధరలు సూడు
రాకేట్ లా దూసుకెళ్తున్నవి–
దళారులు ధరలు పెంచి
ప్రజల దోస్తున్నరు
పెరుగుతున్న ధరల
మీద సర్కారు చర్యలేవి?



–గడ్డమీది
చంద్రమోహన్ గౌడ్
9866510399

## అతి-గతి



ఓ మహాత్మా! ఓమహర్షీ!
సదా స్మరించడమే మా పరమావది
స్వాతంత్రమే నీ ఆశయ పునాది
స్వేచ్ఛ కై ఆరాట పోరాట కరుణానిధి.

ఓ మహాత్మా! ఓ మహార్షీ! !
నియంతలను తరిమిన సారధీ
అహింస సత్యాల అంబుల పొది
నేటి నడత చూస్తే కుములు నీ మది.

ఓమహాత్మా ! ఓ మహర్షీ! !
తిరోగమన మే ఊరేగుతున్నది
పురోగమన నడక మీన మేషాలు లెక్కిస్తున్నది
నీతి నిజాయితీ మానవత రోగ గ్రస్తమైనది.

ఓ మహాత్మా! ఓమహార్షీ! !
నిత్యం సేవిస్తున్నారు నీ జనం బ్రాంది
ఆడపిల్లలపై అఘాయిత్యాలే నాంది
దేశ మాతను మరచిన నీ బిడ్డల దృష్యమిది.

ఓమహాత్మా! ఓ మహర్షీ! !
చేయక తప్పదనే విసుగుగా
నీ జయంతి
కడుపులో లేని ఆచరణల దుష్ట సంస్కృతి
మాకిక బోడ మల్లప్పలే అతి గతి
(గాంధీ జయంతి సందర్భం గా)



-నమిల కొండ నాగేశ్వర్ రావు
8688553470

## మానవత్వంతో ఆనందనవనం

ఎంతకాలమని హింసిస్తావు
అరాచకాలకు అంతులేనట్లు
అమానుషత్వ వికృత కేళికి
కాలం చెల్లిందని తెలుసుకో!.
సీతమ్మను చెరబట్టి లంకకు చేటు తెచ్చిన
పదితలల రావణునిలా కాదు
మానవత్వానికి మంచి నడత మెరుగులద్దిన
పురుషోత్తముడైన శ్రీ రామునిలా మారు!
సుమబాల వెదజల్లే సువాసనలను
మంచితనపు పరిమళంతో గుబాళించనీ?
మొగ్గ దశలోనే తుంచాలని చూడకు
నీ ఉనికికి నువ్వే గొయ్యి తవ్వుకున్నట్లు!
అంతరిక్షాన్నేలే అగణిత శక్తిని గుర్తించు
అణగదొక్కి నిర్దాక్షిణ్యంగా అంతంచేయకు
విశ్వమంతా విస్తుపోయేలా పరిమళించనివ్వు
ఆనంద(న) వనంలోని మానవత్వ పువ్వు!
కనికరం లేకుండా కాలరాస్తున్నా
కనపడనట్లు తప్పించుకు పోతే ఎలా చెప్పు
కంటికి రెప్పలా కాపలా కాసే తోటమాలిలా
పహరా కాయాలి హమేషా నువ్వు!
కర్కశత్వానికి చోటు లేదని చెక్కు పెట్టు
పదికాలాలు నీ పేరును చెప్పుకునేటట్టు
పనికిమాలిన పైశాచికత్వానికి పాడె కట్టు
చరిత్ర నిన్ను సదా స్మరించుకునేటట్టు!

-వి.వి.వి.కామేశ్వరి
(ల్ని)ఏ డాలస్

## ఇందూరోళ్ళం

బోనాలు బాగా జరిగాయ్ జబర్దస్త్ గా
అమ్మోర్ల భరోసాలు అందాయ్
ఇంకా బాగా
అయితే....
బాగా మన నిజాం బాదు
బాగుపడాలంటే.....
బాగా యాదికి రావాల మనకు
బయటిరింగు బడా రోడ్డు
జామ్ అయిపోతున్న రాస్తా ల్లో
జర సై చ లేమంటూ తొక్కిసలాడే
(ని)జామాబాద్ ఊరి జనాన్కి
దిమాక్ ఖరాబయ్యేలా కల్వర్టులు,
రోడ్ల పనుల షురూల ఉస్సూర్లు .
మాలాపల్లి దార్ల బేజార్లు
రోడ్లంటా ఉసుర్లు తీస్తున్నఇలాకాలు.
పరేషాన్ చేస్తున్న పబ్లిక్ లిఫ్టులు
ఖరాబై పోయిన నల్లాలు
షావుకారీకార్ఖానాల్లోంచి
ఊర గల్లీల్లోకి దూరి
కంపుకక్కుతున్న మురికి కాల్వలు.
జమా బందీ లెక్కల జాబితా లో
జమ అయ్యి ఉన్న నిజమైనబాధలు
నిజామాబాదు జనం గుండెల్లో దండిగ ఉన్నాయ్
అవన్నీ కూడా బాగా యాదికి రావాల!.
ఊరేగిన్రు అమ్మోర్లందరూ
ఖిల్లా లోంచి ఊర్లోకీ గల్లీల్లోకి...
ఇంకేం.. పూరాభద్రం అయిపోయింది
ఇందూరు ఇందూరే!!.
అనుకుంటూ
సక్కత్తు గుడుంబ తాగి
దమ్ తీస్కొని కున్కులోకి జారుకోకు
జర జాగ్రత్త బిడ్డా
గుండెల్లో దండిగ ఉన్నాయ్
బేజార్లు పరేషాన్లు హజార్లు హజార్లు
అవన్నీ కూడా బాగా యాదికి రావాల!
కోర్కెలు కాదు
కనీసం కష్టాలు తీరాల!!



-డా గాదిరాజు
మధుసూదనరాజు
9703316760




## భజన తరంగాలు



- పి.చంద్రశేఖర అజాద్
92465 73575

ఈరోజు భజన గురించి మాట్లాడుకుందాం. ఇది మేం ఎవరికో చేస్తున్న, చేయాలనుకుంటున్న భజన కాదు. ఇంకో విషయం. భజన చేయాలంటే చిడతలు అవసరం లేదు. అసలు నరజాతి చరిత్ర సమస్తం చిడతలమయం. అవి వాయించేవారు వుండరని దిగులు ఎవరికీ అవసరం లేదు. ఒకవేళ అలాంటి పరిస్థితి వస్తే మన డబ్బాలు, మన చిడతలు, మన ఢంకాలు మనమే వాయించుకుంటాం. ఈరోజు ఏ రంగంలో ఎదగాలన్నా రెండే ముఖ్యం. ఒకటి స్వ డబ్బా - రెండు పర డబ్బా!

ఈ రెండు పనులు చేయనంటే చరిత్రపుటల్లో నీ పేరు కనిపించదు. టీ.వీ. చర్చల్లోనూ ఇదే తంతు అని ఇంతకుముందు అనుకున్నాం. పది నిమిషాలు ఇంట్రో లేకపోతే వీక్షకులకు అసలు విషయం అర్థం కాదు. అలా అలవాటు చేశారు. చర్చల్లో పాల్గొనేవారే మాట్లాడాలా, యాంకర్ కి అవకాశం ఇవ్వరా? అయినా చర్చలన్నీ భజనలు కావు. అందులో బోలెడన్ని బూతులు, విమర్శలు, అప్పుడప్పుడు పాదరక్షలు ఉపయోగించటం వుంటుంది.

అసలు విషయానికి వస్తున్నాను. మేము భజన చేయటం కాదు. మాకు భజన చేయడానికి ఓ మేధావి మా దగ్గరకు వచ్చాడు. ఆయన పూల గుత్తులు తేలేదు గాని పద్యాలు రాసుకొచ్చాడు. ఇవన్నీ మీకే అంకితం అన్నాడు.

ముత్యాలముగ్గు సినిమాలో రావుగోపాలరావు గారు ఎవరైనా భజన చేస్తుంటే అలర్ట్ చేయడానికి ఓ మనిషిని ఏర్పాటు చేసుకున్న విషయం మనందరం చూశాం. ఆ రకంగా ప్రపంచానికి ఓ సందేశం ఇచ్చారు. భజంత్రీలు అంటే మైకం కాదు అవి హెచ్చరికలు అని. అందుకని మేము ముందుగానే అనుకున్నాం.

"మనం పొగడ్తలకు పడిపోకూడదు" అన్నాను.

"మనకి పొగడ్తలే వస్తాయని ఎందుకు అనుకుంటున్నావు?" అంది అన్య.

"దాన్నే దూర దృష్టి అంటారు" అంటుంటే...

"అదేదో మనమే ఏర్పాటు చేసుకుందాం అంటున్నాడు మేంగో" అన్నాడు విదు.

"నన్ను మాట్లాడనీయండి తర్వాత మీరు ఏమైనా అనండి. మనం కాలమ్ అనుకున్నాం. ఛానల్ అనుకున్నాం. యూట్యూబ్ ఇంకా సవాలక్ష అనుకున్నాం. ఇవి మొదలు పెడుతున్నాం అనగానే ముందు దాడి చేసేది పొగడ్తలే. తర్వాత కాలంలో మీరు చెప్పిన విమర్శలు. ఇంకా దాడులు మొదలవుతాయి. అది నా దృష్టిలో వుంది. అసలు ఓ మనిషినో, ఓ కవినో, కళాకారుడినో యాక్టివిస్ట్ నో చంపేయాలనుకుంటే..."

"చంపటం కాదు. అది ఒక్కసారి జరిగితే, షూట్ చేస్తే, నరికేస్తే అది హత్య అవుతుంది. అందుకని స్లో పాయిజన్ అంటే బాగుంటుంది" అంది అన్య.

"నీతో ఏకీభవిస్తున్నాను. చంపటానికి మరో పేరు ప్రశంస. హద్దులు లేని, వాస్తవానికి సుదూరంగా వుండే, లాజిక్కులు అవసరంలేని భజన. ఆ తుఫాన్ ని తట్టుకోలేకపోతారు. అదే విమర్శ అయితే రెచ్చిపోతారు. అందుకని సులభ మార్గం చిడతలు. కాబట్టి మనం వీటికి దూరంగా వుందాం. మనల్ని ఎవరు ఆ ట్రాప్ లో పడెయ్యాలనుకున్నా ఎవరికి వాళ్ళం ధ్వని చేయాలి. అంతే" అన్నాను.

ఇప్పుడు మమ్మల్ని పద్యాలతో ముంచాలనుకున్న వ్యక్తి గురించి మాట్లాడుకుందాం.

"అబ్బాయిలూ అండ్ అమ్మాయి! నేను వంద గ్రూపుల్లో సభ్యుడ్ని. ఇకనుంచి మీరు తుమ్మినా నేను వాటిలో పోస్ట్ చేస్తుంటాను. లైకులే లైకులు. ప్రశంసలే ప్రశంసలు" అంటూ మొదలుపెట్టాడు.

"మీరేం చేస్తుంటారు?" అంది అన్య.

"నేను రిటైర్ అయ్యాను. పెన్షన్ వస్తుంది. పిల్లలు విదేశాల్లో వున్నారు. వాళ్ళూ డబ్బులు పంపిస్తారు. నా ధర్మపత్ని ఇటీవల మరణించింది."

"మరి మీరు ఇక్కడెందుకు విదేశాలు పోవచ్చు కదా?"

"అది భారతీయతకు అవమానం. నేను ఇండియన్ని అందుకని?"

"మీ పిల్లలు ఇండియన్స్ కాదా?" విదు మధ్యలో అన్నాడు.

"విదూ - వారిని మాట్లాడనీయండ్రా బాబూ!" అన్నాను.

"పిల్లలు మన మాట వినరు. అందుకని వారి గురించి అనవసరం. ఇప్పుడు నాకు పొద్దుగడవదు. ఇన్ని దశాబ్దాలు నేను, నా కుటుంబం తప్ప ఏదీ పట్టించుకోలేదు. నేను ఆత్మ విమర్శ చేసుకున్నాను. ఇకనుండి అయినా మనం సమాజ, సాహిత్య సేవ చేయాలని. నాకు కూడా కవిత్వం, కథలు రాయాలని టించ్ వుంది. ముఖ్యంగా మీలాంటి వారిని ప్రోత్సహించాలి. అందుకే గ్రూపుల్లో చేరిపోయాను."

"అయ్యా మీ ఉద్దేశం మంచిదే కానీ మేము చిన్నవాళ్ళం. మేము ఇప్పుడిప్పుడే మొదలుపెట్టాం. మాకు అనుభవం తక్కువ."

"అలా అనకండి. మీ కాలమ్ ని చూస్తున్నాను. మీరు మిస్టర్ క్లీన్ గారినో మీ తాతగారినో మధ్యలో తీసుకువస్తున్నారు. వారి చేత అభిప్రాయాలు చెప్పిస్తున్నారు. అందులోనే మీ సంపాదక పరిణతి కనిపిస్తోంది."

"ఇకనుండి మిమ్మల్ని కూడా మా ఛానెల్ కి పిలుస్తాం" అంది అన్య.

"అలా కాదు. మనం కూడా ఈ తాతగారి వయసు వచ్చాక గ్రూపుల్లో చేరి భజనలు చేద్దాం. అప్పటిదాకా మంచిగా చదువుకుని ఉద్యోగాలు చేసుకుంటూ, లంచాలు పుచ్చుకుంటూ, పిల్లల్ని విదేశాలు పంపించుకుందాం. నేను వెళుతున్నాను. నాకు బోలెడు పనులు వున్నాయి" అంటూ విదు వెళ్ళిపోయాడు.

ఆయన నిర్ఘాంతపోయాడు.

"మా విదూకి కాస్త కోపం ఎక్కువ. మీరు పట్టించుకోవద్దు. కంటిన్యూ చేయండి" అన్నాను.

"అది కాదు పిల్లలూ, ఇప్పుడైనా మేము సమాజానికి ఉపయోగపడటం నేరం అంటారా? అయినా ప్రోత్సాహం లేకపోతే ఎవరైనా ఎందుకు కవిత్వాలు రాయాలి. కథలు రాయాలి? మీరు మా పిల్లల లాంటివారు" అంటున్నాడు.

"తాతగారూ! మీకు పొద్దు గడవకపోతే ఇంకేమైనా పనులు చేయండి. మీలాంటివారి వల్ల సెల్ ఫోన్లు నిండిపోతున్నాయి. అవన్నీ డిలీట్ చేసుకోవడం పెద్దపని. అందరికీ ఏవో పనులు వుంటాయి. అయినా ఈ తరంలో చాలామంది భజన కావాలనుకోవడం లేదు. మీరు మీ అనుభవంతో మంచి సూచనలు చేయండి. అది వారికి ఉపయోగపడుతుంది. మంచి విమర్శ చేయండి" అంది అన్య.

"ఇప్పుడు విమర్శను ఎవరు తీసుకుంటున్నారమ్మా?" అన్నాడాయన.

"తీసుకోకపోతే మీకు నష్టం లేదుగా, వారికే నష్టం. మీరు భజనకు అలవాటు పడే తరాన్ని తయారు చేయకండి. మేం మిస్టర్ క్లీన్ గారితో చెప్పించే వాటి మీద చాలా విమర్శలు వున్నాయి. కొంతమంది ఆయనకి అభిమానులు అయ్యారు. అయినా మా మెంటార్, మేమూ మురిసిపోము" అంది అన్య.

"అంటే మిమ్మల్ని పొగిడినా, అభినందించినా మీకు సంతోషం కలగదా?" అని వాపోయాడు.

"ఎందుకు సంతోషం కలగదు తాతగారూ! ఎవరు ఎందుకు పొగుడుతున్నారు? ఎందుకు విమర్శిస్తున్నారు? తెలుసుకున్నవారికి భవిష్యత్తు వుంటుంది. వారు సమాజానికి ఎంతో కొంత మేలు చేస్తారు" అన్నాను.

ఇది అనంతం.

## జీవితం

జీవితం ఒక విచిత్రం..
ఈ జీవిత ప్రయాణం
ఆగమ్య గోచరం.
ఎవరితో ఎవరికి ముడి పడి ఉందో
తెలియని సందిగ్ధం
ఎవరెవరితో ఎంతకాలం ఉండేదేదో
గుర్తెరుగని జీవితం.
మనమంటే ఇష్టం లేని వ్యక్తులతో కలిసి జీవిస్తామా?
లేక,మనం ఇష్టమనే వ్యక్తులతోనే
జీవితాన్ని కొనసాగిస్తామా తెలియనితనం.
జీవించినంత కాలం గొప్పగా బ్రతికామా...
పేరు, డబ్బు, హోదా సాధించామా? లేక,
అవి ఏవి సాదించక సాధారణ జీవితమే గడిపామా?
అనేది కాలానికి వదిలేసిన జీవితం!
ఎలాంటి జీవితం గడిపినా,
తోటి వారికి మంచిని పంచుతూ..
అందరి నోట మంచి వ్యక్తిగా జీవిస్తే చాలు.,
ఈ జీవితానికి
జీవితపు తదనంతరం అదే పరమార్థం!



-ఎన్.రాజేష్
9849335757

## పెద్ద కర్మ వరకే..!

ఎందుకని..
ఏముందని..
ఏది శాశ్వతమని..
ఈ అహంకారం
ఈ ఆస్తిపాస్తులకు ఆరాటం !
ఎవరి కోసమని..
ఎంత సమయమని..
ఏది గమ్యమని..
ఈ ఎడతెగని ఏడుపు..
ఈ అంతమెరుగని పోరాటం !
ఎవరు నీవారని..
ఏమి సాధించావని..
ఎవరి కన్న గొప్పని..
ఈ లక్ష్యం లేని పరుగు
ఈ అనైతిక ఆలోచన ముసుగు !
నీ కోసం నీవని..
నీ వెంట ఎవరు రారని..
నీ నవ్వులు ఎవ్వరికీ నచ్చవని..
ఈ రోజైనా తెలుసుకో..
నీ ఖాతాలో పుణ్యాన్ని వేసుకో !
నీ సంపాదన పంచుకుంటారు
నీవు చేసిన పాపాలను పంచుకోరు
నీకు తోడుగా శ్మశానం వరకే వస్తారు
నీ జ్ఞాపకాలు పెద్ద కర్మ వరకే సాగిస్తారు
నీ కీర్తి మాత్రమే నిలిచిపోతుంది !



-మధుపాళీ
9949700037

## పేరు ప్రతిష్టలు (కథ)



నరసింహపురంలోని శరభయ్య చాలా పేదవాడు. అతడు కొలువు కోసం వెదకసాగాడు. వెదకగా వెదకగా అతనికి దానయ్య ఇంట్లో కొలువు ఉన్నదని తెలిసింది. అతడు దానయ్య ఇంటికి వెళ్లి అతనిని కలిసి తాను వారింట్లో పని చేస్తానని చెప్పాడు. అప్పుడు దానయ్య " నేను నీకు నీ జీతాన్ని నీవు కష్టపడి పని చేయడం, నీ ఆసక్తి, నీ ప్రతిభను బట్టి ఇస్తాను. అది కూడా రెండు నెలలకు కలిపి ఒకేసారి ఇస్తాను. ఇది నీకు సమ్మతమైతే రేపటి నుండియే నీవు పనిలో చేరు" అని అన్నాడు. అందుకు శరభయ్య అంగీకరించాడు.

మొదటిసారి శరభయ్య దానయ్య ఇంట్లో చెమటోడ్చి కష్టపడి పని చేశాడు.రెండు నెలలు అయిన పిమ్మట శరభయ్య అతనికి పది వేలుమాత్రమే ఇచ్చాడు . శరభయ్య ఆ జీతం తీసుకుని మరుసటి నెలల్లో బాగా కష్టపడి ఇంకా ఎక్కువ జీతం పొందాలని అనుకున్నాడు. కానీ కొన్ని అవాంతరాల వల్ల అతడు రెండవసారి అనుకున్నంత బాగా కష్టపడి పని చేయలేకపోయాడు. ఈసారి జీతం చాలా తక్కువగా వస్తుందని అతడు అనుకున్నాడు. కానీ ఈసారి యజమాని అతనికి ఎక్కువగా ఏకంగా పదిహేను వేల రూపాయలు ఇచ్చాడు.

“ఇదేమిటి? నేను ఈసారి ఐదు వేలు కూడా రావని అనుకుంటే మా యజమాని ఏకంగా పదిహేను వేల రూపాయలు ఇచ్చాడు? ఈసారి నేను గతం కన్నా తక్కువ పని చేసినట్లు నాకు గుర్తు “అని అనుకున్నాడు శరభయ్య. ఆ మాటే తన యజమానితో అన్నాడు. “అయ్యా! ఈసారి నేను పోయిన రెండు నెలల కన్నా ఈసారి చాలా తక్కువగా పనిచేశాను. కానీ మీరు పొరపాటున నాకు పదిహేను వేల రూపాయలు ఇచ్చినట్టున్నారు. బహుశా మీరు లెక్క తప్పినట్లు నాకు అనిపిస్తోంది “అని అన్నాడు.

అప్పుడు యజమాని “అదేం కాదు. నేను సరిగానే ఇచ్చాను. నీవు పోయినసారి కేవలం నాకు ఒక్కడికి మాత్రమే ఉపయోగపడే పనిని చేశావు. కానీ ఈసారి నేను చెప్పకున్నా పెరటిలో ఉన్న పాడుబడిన బావిని బాగు చేసి ఆ నీటిని పదిమందికి ఉపయోగపడేటట్లు చేశావు. నీవు మొక్కలు నాటి వాటిని నీ ఇంట్లో మొక్కలని భావించుకొని వాటిని సంరక్షించి నీళ్లు పోసావు. అవి ఇప్పుడు పూలు పూస్తున్నాయి. కాయలు కాస్తున్నాయి. అవి పదిమందికి ఉపయోగపడుతున్నాయి. నన్ను అడిగి ఆ నీటిని వాడుకొని ఆ పూలను, కాయలను తెంపు కున్న ఇరుగు పొరుగు వారు వచ్చి నన్ను పొగడుతుంటే నాకు చాలా ఆనందంగా ఉంది. మీకు ఓపిక గల నౌకరు దొరికాడని అంటున్నారు. పరులకు సాయం చేయాలన్న నా లక్ష్యం, నీ లక్ష్యం ఒకటే! నాకు పేరు ప్రతిష్ఠలు తెచ్చేలాగున కష్టపడుతున్న నీకు అందుకే ఎక్కువ జీతం ముట్ట చెప్పాను” అని అన్నాడు యజ మాని. శరభయ్య సంతోషంతో ఆ మరుసటిరోజు నుండి యజమానికి ఇష్టమైన పనులను చేసి ఎక్కువ జీతం పొందాడు.



-సంగనభట్ల చిన్న రామకిష్టయ్య
9908554535

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1887వ రోజు 'ప్రథమచికిత్స' అనే అంశంపై పలువురు కవులు తమ కవితలను పంచుకున్నారు. కవితల సాధన చేస్తున్న కవులందరికీ అభినందనలు. 'ప్రథమచికిత్స' అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం. -సంపాదకులు

**మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం**



అడ్మిన్ & నిర్వహణ
డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు,
9441046839

## జీవదీపం

ఆపదలో నిలిచే ప్రతి చేయి
ఆశల దిశగా సాగే అడుగు
కంగారు పడే క్షణ కాలంలో
ధైర్యం చెప్పే అనురాగం.
ఆగిపోతున్న గుండె చప్పుడుపై
నమ్మకంతో పడే ప్రతి ఒత్తిడి
జారిపోతున్న ప్రాణం పైన
సమయానికి పడే ఒక ముడి!.
వైద్యశాలకు చేరే లోగా
మృత్యువునైనా అడ్డుకునే గోడ
గాలి వెతుక్కునే శ్వాసలకు
దారికాచే ఒక కొత్త తీరం.
చిన్న గాయానికి ఓదార్పై
కారిపోయే నెత్తుటిని ఆపేలా
విరిగిన ఆశల అవయవానికి
ఆసరాగా మారే ఊరటగా!.
ప్రథమ చికిత్స మందు కాదు
మనుషుల మధ్య మమకారం,
సమయస్ఫూర్తితో చేసే సాయం
నిశ్శబ్దంగా వెలిగే జీవదీపం!.

-విజయలక్ష్మి వడ్డేపల్లి

## ఆచరణ

అనారోగ్యాలకు కారణం
అజ్ఞానంతో కాలయాపన
చేరువున్న ప్రథమ చికిత్స
పద్ధతులను విస్మరించడం
పెరటి చెట్టు వైద్యానికి
పనికిరాదన్నట్లు
మనకు మనమే
చికిత్సలకు దూరం.
పలు చిట్కాలు
సులభంగా లభ్యమయ్యేవి
అనాదిగా
వాడుకలోకి తెచ్చిన పూర్వజులు
ప్రథమ చికిత్సలకు సోపానాలు,
ఏ అనారోగ్యమో ప్రమాదమో
జరిగినా
గాభరా పడక
అప్రమత్తతతో ప్రథమ చికిత్స
రోగికి ఊరట.
గాయాలు
ఆకస్మిక రుగ్మతలు
సాధారణ రోగాలు
జలుబులు, జ్వరాలు
అతిసార విరేచనాలు
ఆకస్మిక రుగ్మతలకు
కావాలి అత్యవసర చికిత్స
ఆదుకొంటుంది ప్రాణాలను
తక్షణం అందించే చికిత్స.
బస్సు ట్రెయిన్లు
విమానాల ద్వారా
రాకపోకలు సాగించే ప్రయాణంలో
అనుకోని అవాంతరాలు
ఏర్పడినప్పుడు
ప్రథమ చికిత్సను అందించే
కిట్స్ అందించాలి
స్వీయ చికిత్సా ప్రక్రియను
బోధించాలి.
ప్రతి విద్యా సంస్థల్లో
క్రీడలు యోగా
వ్యాయామం
చికిత్సా పద్ధతులను
అనుసరించాలి ప్రతి
ఒక్కరూ
ప్రజల శ్రేయస్సు కోరి
అవగాహనా శిక్షణను
నిర్వహించాలి
నాటు మందుల పట్ల
పల్లె ప్రజల నమ్మకాలకు
స్వస్తి పలికేట్లుగా
పల్లె ప్రజలకు
భద్రత కల్పించాలి..

-పి.పద్మావతి

## చేయూత

చదువుతో పనిలేని
పదునైన ఆలోచన
వెదుకు చిట్కాలు
ఆచరణలో సత్వరం
చెక్ కాల్ కేర్
సూత్రాలతో
సరైన అవగాహన చేయూతతో
అనుకోని ప్రమాదాలకు
సత్వరచర్యలు
ఖంగారు పడి రోడ్డుపై
పరుగులతో ప్రమాదం.
చూసి ఊరుకుని
దులపరించుకోటం తప్పు
తెలిసీ తెలియని
చికిత్సతో ముప్పు.
ఇంటా బైట
బడిలో సదా
ఫస్ట్ ఎయిడ్ బాక్స్!
దూది డెట్టాల్
బ్యాండేజీతో తయార్
కాలితే, రక్తంకారితే
తడిగుడ్డ ఐస్ ముక్క
గొంతులో ఆహారం
అడ్డుపడితే వీపుపై తట్టు
విషపు పురుగుకుడితే
బిగించికట్టు
వైద్యంకై పరుగెత్తు
గుండె లబ్ డబ్ కి
సి.ఆర్.పి.తో ఊపిరూదు
ముక్కు నించి రక్తం కారితే
తల కిందకి వాల్చి
ఉల్లిగడ్డ వాసనచూపు
తడిబట్టకప్పు.
రోగిని వాహనంలో ఆసుపత్రిలో
మన ధర్మం అని మరవద్దు
మానవత్వంతో స్పందించే
హృదయమే
దేవాలయమని మరవద్దు .
స్కౌట్ ఎన్.సి.సి.లో
ప్రథమచికిత్స
ఇదే అసలు సిసలు విద్య.

-ఎ.రాజ్యశ్రీ

## ముందు జాగ్రత్త!

గతి తప్పుతున్న జీవనశైలితో
అనారోగ్యాల పాలవుతున్న
నేటి జనం
మానసిక శారీరక ఒత్తిడితో
నగర జీవనం
రోగాల నిలయం.
కాలుష్యం మంటల్లో
మగ్గిపోతున్న
ప్రజల ఆరోగ్యంతో
చెలగాటమాడుతున్న రోగాలు
ఆరోగ్య భద్రతకు
కొంతైనా ఉపశమనం
కలిగించే వంటింటి చిట్కాలు
అత్యవసర పరిస్థితుల్లో
ప్రథమ చికిత్స
అందిస్తుంది జీవితానికి భరోసా.
దుర్ఘటనల వల్ల
జరిగే గాయాలకు
నిదానంతో ప్రథమ చికిత్స
క్లిష్టాలను నివారించగలం,
కషాయాలు, లేపనాలు
సరళ వ్యాయామాలు
కట్లు వగైరాలు,
ఎన్నెన్నో సులభ చికిత్సలు
ఆచరణ అవసరం,
ప్రథమ చికిత్స కిట్లు
ప్రతీ చోటా ఏర్పరచుకోవటం
అతి అవశ్యం.
ప్రథమ చికిత్సలో
ప్రమాదాలు తెచ్చే
నాటు పద్ధతులను వ్యతిరేకించాలి.
యోగా పద్ధతులు
ప్రథమ చికిత్స యోగ్యములు
ఆయుర్వేదం, హోమియో.

-రాజప్ప

## అత్యంత కీలకం

రోడ్డు ప్రమాదం
హార్ట్ ఎటాక్
పాము, తేలు కాటు
ఆహారం గొంతులో
ఇరుక్కోవడం
ఆస్తమా, విద్యుత్ షాక్
ఏదైనా సరే
వెంటనే చేసే ప్రథమ చికిత్స
రాబోయే పెనుముప్పు
నివారిస్తూ
మానసికంగా
శారీరకంగా బలపరిచే
చక్కని ఉపయోగం!!.
ప్రమాదం షాక్ లో
ఉన్నవారికి
నీరు తాగించి
సౌకర్యంగా ఉంచి
తక్షణమే
అంబులెన్సుకు ఫోన్ చేసి
ఈ లోపు
అవసరానికి తగిన విధంగా
ప్రాథమిక చికిత్స చేయడం
పౌరులందరికీ తెలిసి ఉండాలి
పాఠశాల స్థాయిలో
స్కౌట్ విద్యార్థులకు
ప్రకృతి విపత్తుల్లో సైతం
ప్రథమ చికిత్సను
నేర్పుతారు!
అది ఎంతో ఉపయుక్తం!!.
ఓ నర్సింగ్ యూనిట్ చేసే పని
ప్రథమ చికిత్స చేయగలదు
బాధితుల్ని చూసి తొలగిపోకండి
ప్రథమ చికిత్సతో రక్షణనిచ్చి
మానవతాసుమాన్ని
పరిమళభరితం చేద్దాం!!.

-ఎం.వి.ఉమాదేవి

## ముందుగానే మేలుకో

అనుకోని ఆపద
అనారోగ్యం వస్తే
వైద్యుని దగ్గరకు వెళ్లే
సమయం లేకుంటే
చేసే తొలి ఉపచారం
ఇదే కదా...
ఇదే ప్రథమ చికిత్స !
రక్తస్రావం తక్షణం ఆపాలంటే
మెత్తని శుభ్రమైన గుడ్డతో చుట్టాలి!
గుండెల్లో నొప్పి అనిపి,స్తే
తక్షణమే ఛాతీని నొక్కుతుండాలి!
కృత్రిమ శ్వాస అందించాలి!
ఒంటిపై కాలినట్లయితే
కాసేపు చల్లని నీటి ధార పోయాలి!
గొంతులో ఏదైనా చిక్కుకుంటే
వ్యక్తిని ముందుకు ఉంచి
వీపుపై గట్టిగా గుద్దుతుండాలి!
ఎముక ఏదైనా విరిగినట్లు అనిపిస్తే
అట్ట లేదా కర్రముక్కలు ఆనించి
సిరి చేసి భద్రంగా కట్టు కట్టాలి!
బెణుకులు సంభవిస్తే,
ఆ భాగం ఎత్తులో ఉంచి
ఐస్ పెట్టాలి!
ఇలా ప్రథమ చికిత్సను అందిస్తే
రక్షించొచ్చు మనిషి ప్రాణాలు!
చూడొచ్చు పరిస్థితి విషమించకుండా!
చేయొచ్చు త్వరగా కోలుకునేలా!
తగ్గించొచ్చు నొప్పిని
ఆందోళనను కూడా!
ముందు జాగ్రత్తలు ముఖ్యం!
గాలి బాగా తగిలేట్లు రోగిని ఉంచాలి!
రోగి గాలి పీల్చుకునేలా చూడాలి!
చుట్టూ ఎవరు మూగ కూడదు!
వెంటనే అంబులెన్సుకి ఫోన్ చేసి
రోగిని ఆసుపత్రికి తరలిస్తే
జరుగుతుంది శుభం!.

-కోలా సత్యనారాయణ

30(నేటినిజం ప్రతినిధి):

# నామమాత్రాలైన వయోవృద్ధుల సంక్షేమ చట్టాలు

కన్నవారు, తాము పెంచి పెద్ద చేసిన తమ వారు, బంధు బాంధవులు, కడదాక తమకు వెన్నంటి ఉంటారని అనుకుని, అశక్తత ఆవహించిన ముదిమి వయసులో, అందరూ వదిలి వేస్తుండగా, ఒంటరితనం భరించడం భయంకరమైన వేళ... విధి వంచితులైన ఎందరో వయోవృద్ధులు, పడుతున్న బాధలు వర్ణనాతీతం. వయోవృద్ధుల సంక్షేమార్థం చేసిన చట్టాలు, వాటి అమలుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, కాగితాలకే పరిమితమై, ఆచరణకు నోచుకోలేక మృగ్యాలే అవుతున్నాయి. భారతదేశములో ప్రస్తుతము 15కోట్లమంది వృద్ధులున్నారు. 2050 నాటికి వీరిసంఖ్య 32.3కోట్లకు చేరుతుందని అంచనా. మనరాష్ట్రంలోని వృద్ధుల సంఖ్య అప్పటికి రెండున్నర కోట్లు దాటే అవకాశం ఉంది. తెలంగాణ రాష్ట్రంలో 40 లక్షల మంది వయోవృద్ధులు ఉండగా, వీరిలో 10 శాతంకు మించకుండా ఆర్థికంగా, ఆరోగ్యంగా, తమ తమ పిల్లల, బంధువుల వద్ద ఉంటుండగా, మరికొందరు తమ పిల్లలే చేర్పించిన అనాధ శరణాలయాలు, వృద్ధాశ్రమాలలో తమ దుస్థితిని తామే తిట్టుకుంటూ, కాలం వెళ్లదీస్తున్నారు. ఆకలితో అలమటిస్తూ, అనారోగ్యాలకు బలి అవుతూ, నిరాదరణ నీడలో మగ్గుతూ, ఎందరో తమ దుస్థితికి ఆవేదన చెందుతుండటం హృదయ విదారకమై, గుండెలను పిండి వేస్తున్న సచిత్రం సర్వత్రా సాక్షాత్కార మిస్తున్నది. దేశములో నెలకొన్న పరిస్థితులవల్ల సామాన్యులకు నానాటికీ బతుకు భారము అవుతున్న రోజులివి. అదేక్రమ ము లో వృద్ధులవట్ల నిరాదరణ కూడా అంతకంతకు ఎక్కువై పోతోంది. దేశాన్ని పాలిస్తోంది ప్రధానంగా వృద్ధనేతలే అయినప్పటికీ వయోవృద్ధుల సమస్యలకు పరిష్కారం కనబడక పోవడము అసలైన విషాదం. దేశంలోని ప్రతి అయిదుగురి వృద్ధుల్లో ఒకరు ఒంటరిగా జీవిస్తు న్నారు. ముగ్గురిలో ఒకరు వేదింపులకు గురవుతున్నారు. 'హెల్పేజ్ ఇండియా' అధ్యయనం నిగ్గుతేల్చిన విషయ మిది. వృద్ధాప్యంలో కుటుంబ సభ్యులే వృద్ధుల పాలిట శత్రువులుగా మారుతు న్నారు. దూషణలకు పాల్పడటమే కాకుండా కొందరు శారీరక హింసకూ పాల్పడుతుండటం పతనమవుతున్న మానవతా విలువలకు నిదర్శనం. వాస్తవానికి వృద్ధులు జాతి సంపద! వారి అనుభవాలు ముందు తరాలకు అమూల్యమైన పాఠాలు. అందుకే పాశ్చాత్య దేశాలు వృద్ధుల సంరక్షణకు దీటైన చట్టాలు రూపొందించాయి. బతికినంత కాలం వృద్ధులను కుటుంబ సభ్యులు ఆదరణతో చూసుకునే విధంగా పటిష్ఠ నిబంధనలు చట్టంలో పొందు పరచారు. అనేక దేశాలు చట్టాలు చేసిన 50 ఏళ్ళ తర్వాత, "తల్లిదండ్రుల, వయో వృద్ధుల పోషణ సంక్షేమ చట్టం 2007" మన దేశంలో రూపొందించ బడ్డది. ఐతే దీని గురించి ఎలాంటి అవగాహన సదస్సులు నిర్వహించక పోవడం, సదరు చట్టంపై చాలా మందికి అవగాహన లేకపోవడం, సర్వత్రా కనిపిస్తున్నది. ఫలితంగా ఆ చట్టం నిరుపయోగం అవుతున్నది. సంరక్షణ, భద్రత కల్పించాల్సిన వయోవృద్ధులను, సీనియర్ సిటిజన్లను కుమారులు, కూతురులు విడిచిపెట్టి, పరిత్యాగం చేసే విధంగా, బుద్ధిపూర్వకంగా వ్యవహరించినా, చట్ట ప్రకారం శిక్షార్హమే. శిక్షాకాలం ఒక టర్మ్‌కు, మూడు మాసాల జైలు శిక్ష లేదా అపరాధ రుసుము, గరిష్టంగా ఐదు వేల రూపాయలు, రెండింటిని విధించవచ్చు. జిల్లాస్థాయిలో అప్పిలేట్ ట్రిబ్యునల్ కు జిల్లా కలెక్టర్, డివిజన్ స్థాయిలో ఆర్. డి. ఓ. నిర్వహణ అధికారులుగా వ్యవహరిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు ఒక వృద్ధాశ్రమం ఏర్పాటు చేయాలని, సీనియర్ సిటిజన్లకు వేరుగా క్యూ పద్ధతి ప్రవేశపెట్టాలని, దీర్ఘకాలిక, అంతిమ పునర్వికాసం లేని రోగాల చికిత్సల సదుపాయాలు, ప్రభుత్వమే కల్పించాలని, 2007 సంక్షేమ చట్టం నిర్దేశిస్తున్నా, అమలుకు నోచుకోకపోవడం శోచనీయం. వయోవృద్ధుల సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వం జారీచేసిన వృద్ధుల సీనియర్ సిటిజన్ సంక్షేమ చట్టం పై, సదవగాహన కల్పించడానికి సదస్సులు ఏర్పాటు, ప్రతి జిల్లాలో ఒక వృద్ధాశ్రమం, సీనియర్ సిటిజన్ "డే కేర్" సెంటర్ల నిర్వహణ, ప్రతి మండలంలో వీరి రక్షణ, వైద్య సహాయం కోసం వైద్యశాల, బాధ్యతను ప్రభుత్వం పూర్తిగా మరిచింది. వయోవృద్ధుల సంక్షేమానికి ఒక డైరెక్టరేటును ఏర్పరచి తగిన నిధులను ప్రభుత్వం కేటాయించాల్సి ఉంది. జిల్లాలలో సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ లను నెలకొల్పాలి. తల్లిదండ్రుల, వృద్ధుల పోషణ మరియు సంక్షేమ నియమావళి చట్టం 2011 నిబంధనల మేరకు, జిల్లా కేంద్రాలలో అప్పిలేట్ ట్రిబ్యునళ్ళు, డివిజన్ కేంద్రాలలో ట్రిబ్యునళ్ళు ఏర్పాటు చేసి బాధితుల ఫిర్యాదులను స్వీకరించి పరిష్కరించాలి. ఇతర రాష్ట్రాలలో రవాణా సంస్థల బస్సులలో, 30 శాతం రాయితీ ఉండగా, తెలంగాణలో ఇప్పటివరకు లేదు. ఇంటి పన్నులో 30% రాయితీ ఆదాయపు పన్ను పూర్తిగా మినహాయింపు ఇవ్వాలి. కళ్ళజోళ్ళు, వినికిడి తదితర పరికరాలు, వీల్ చైర్స్, వాకింగ్ సాధనాలు అందించాలి. వీరి రక్షణ చర్యలు గైకొనాలి. దేవాలయాలలో ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించాలి.

"సమస్యల పరిష్కారానికి స్వచ్ఛంద సంఘాలు"

జగిత్యాల జిల్లాలో 80 వేల మంది వయో వయో వృద్ధుల సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి, సౌకర్యాల కల్పనకు, "ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్" ఏర్పాటయింది. విద్యాధికులు, అనుభవైక వైద్యులైన, ఉద్యోగ సంఘాల సీనియర్ నేత హరి అశోక్ కుమార్ అధ్యక్షతన అసోసియేషన్ నడుస్తోంది. వృద్ధుల సంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలు నిర్వహి స్తున్నారు.

(అక్టోబర్ 1 అంతర్జాతీయ వృద్ధుల దినం)



–రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

# సప్త పదులు



ప్రక్రియా సృజనకర్త: సుధామ
సెల్:9849297958

అనకు
కనకు

చాడీలను,
చెప్పుడు మాటలను
ఎన్నడూ
వినకు.
–దోర్బల మంజులత
హైదరాబాదు

ఒలకాలి
గిలకాలిం

సర్వథా
సర్వత్రా
మనం సత్యాన్నే
పలకాలి.
–వనజా రవిచంద్ర రావు
హైదరాబాద్.

మంత్రాంగం
తంత్రాంగం

ప్రభుత్వం నడవాలంటే
చిత్తశుద్ధితో
పనిచేయాలి
యంత్రాంగం
–కపిలవాయి అశోక్‌బాబు
హైదరాబాద్

హరితం
భరితం

పచ్చదనంతో
ప్రకృతి లేకుంటే
లోకమంతా
దురితం!
–డా. గన్నోజు శ్రీనివాసాచారి
మహబూబ్ నగర్

చూసుకో
చేసుకో

జీవితం
తెల్లకాగితం,
అందమైన
రాత రాసుకో.....!!
–శ్రీమతి భారతీకృష్ణ
హైదరాబాద్

సత్యం
కృత్యం

కారు వదిలి
నడిచి
చూడు
నిత్యం.
–డి.వి.వి.ఎస్ మూర్తి.
హైదరాబాద్.

మానం
అభిమానం

సంస్కారం లేని
మనిషి
జంతువుతో
సమానం
–వి.ఎస్.వి.ప్రసాద్ రావు
విజయనగరం.

ఆవాసం
ప్రవాసం

విదేశీ మోజుల్తో
నవ్వుల
పాలవుతున్న
జనావాసం..
–పద్మావతి పి.
హైదరాబాద్

ఒగ్గరు
నెగ్గరు
చెడు తీయగా
ఉంటుంది,
కోరుకునేవారు
తగ్గరు.
–కె.ఎం.కె.మూర్తి
సికింద్రాబాద్

కనిపించు
వినిపించు

అందరిలో
ప్రత్యేకంగా
నువ్వేంటో
సాధించి చూపించు..
–ఋష్యశృంగు ఢిల్లేశ్వరరావు
సారవకోట

# తెలుగు భాషను బతికించుకుందాం, పట్టం కడదాం

**– ప్రముఖ సినీ గేయ రచయిత, సుద్దాల అశోక్ తేజ**

హైదరాబాద్, సెప్టెంబర్ 30(నేటినిజం ప్రతినిధి): పౌర సమాజం నిరాదరణతో పలుచబడుతున్న తెలుగు భాషను కాపాడుకోవలసిన అగత్యం ఏర్పడిందని విచారం వ్యక్తం చేస్తూ దానికి పట్టం కట్టాల్సిన సమయం ఆసన్నమైందని ప్రముఖ జాతీయ ఉత్తమ గేయ రచయిత, ఉమ్మడి కరీంనగర్ ముద్దు బిడ్డ సుద్దాల అశోక్ తేజ అన్నారు. సెప్టెంబర్ 22న తెలుగు భాషా సంరక్షణ సంఘం నిర్వహించిన బుర్ర నర్సమ్మ-లింగారెడ్డి స్మారక **"తెలంగాణ తెలుగు తేజం"** రాష్ట్ర స్థాయి పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమంలో పురస్కారం స్వీకరించి మాట్లాడుతూ... తాను చిన్నతనంలో అతి సామాన్యమైన జీవితాన్ని గడుపుతూ ఎన్నో అపజయాలను పొందానని, అవిశ్రాంత పోరాట ఫలితంగా మాత్రమే తగిన గుర్తింపు




సుద్దాల అశోక్ తేజ, సుద్దాల నిర్మల, దంపతులను సత్కరిస్తున్న జి.వి.శ్యాంప్రసాద్ లాల్, అనుముల దయాకర్, లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి, బుర్ర జానకి రెడ్డి, అన్నాడి గజేందర్ రెడ్డి, దాస్యం సేనాధిపతి, మహ్మద్ ఖాలిద్, విజయలక్ష్మి

వరించిందని అన్నారు. జాతీయ, రాష్ట్ర స్థాయి పురస్కారాలు స్వీకర్త భాద్యతలు మరింత రెట్టింపు చేస్తాయని, తమ తమ రంగాల్లో మెరుగైన ప్రతిభను ప్రదర్శించాల్సి వస్తుందని చెప్పారు. తల్లితండ్రులు సుద్దాల హనుమంతు- జానకమ్మల ఒడిలో ఉగ్గుపాలతో కవిత్వ ఓనమాలు నేర్చుకున్నానని, ఈ మట్టికి ఎంతో రుణపడి ఉన్నానని అంటూ, కరీంనగర్ గడ్డ మీద ప్రముఖుల సమక్షంలో ఈ పురస్కారం తీసుకోవడం సంతోషంగా ఉందన్నారు. నా కరీంనగర్ మట్టి బిడ్డగా ఈ నేలపై నుంచి ఎదిగి రాష్ట్ర స్థాయి , జాతీయ స్థాయిలో రాణించడం సంతోషంగా ఉందని అన్నారు. పాటకు ఈ నేల బడుగు బలహీన వర్గాల ప్రజానీకం పదును పెట్టిందని అన్నారు. తనకు తల్లిదండ్రుల తర్వాత సినారే, శ్రీ శ్రీ, వేటూరి కవన మెలకువలను నేర్చుకున్నానని తెలిపారు. అవమానాలు, అవరోధాలు, సన్మానాలను అధిగమించడం అలవాటు చేసుకోవాలని సూచించారు. తెలంగాణ యాసకు ప్రాచుర్యం కల్పించేందుకు కృషి చేయడం నాకు వినయ గర్వంగా ఉందన్నారు. ముఖ్య అతిథి జి వి శ్యామ్ ప్రసాద్ లాల్, డైరెక్టర్, పౌర సరఫరాల శాఖ మాట్లాడుతూ.. కరీంనగర్ గడ్డకు సాహితీ క్షేత్రంగా మంచి పేరు ఉందని, సినీ పాటకు సాహిత్య విలువలు అద్దిన అరుదైన సాహితీవేత్త సుద్దాల అని అన్నారు. ఈ పురస్కారానికి సుద్దాల అశోక్ తేజను ఎంపిక చేయడం, ఆయన స్వీకరించడం సముచితంగా ఉందన్నారు. సభాధ్యక్షత వహించిన ప్రముఖ సాహితీవేత్త దాస్యం సేనాధిపతి మాట్లాడుతూ.. తమ సంస్థ ద్వారా పలు రకాలైన సాహితీ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని అన్నారు. పురస్కార ప్రదాత కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.. తమ తల్లిదండ్రుల రుణం తీర్చుకోలేనిదని, వారి గుర్తుగా ప్రతి ఏటా ఈ పురస్కారాన్ని అర్హులకు అందజేయడం ఒక వరంగా భావిస్తున్నామన్నారు.

మొదటి సారి నేటినిజం సంపాదకులు బైస దేవదాసు గారికి, రెండవ సారి రాష్ట్ర సాహిత్య అకాడమీ తొలి చైర్మన్ డా॥ నందిని సిధారెడ్డి గారికి ఈ పురస్కారాలు అందజేయడం జరిగింది.

సంస్థ ఉపాధ్యక్షులు అన్నాడి గజేందర్ రెడ్డి సుద్దాల అశోక్ తేజను సభకు పరిచయం చేయగా, శ్రీమతి బుర్ర జానకి రెడ్డి సమావేశాన్ని జ్యోతి ప్రజ్వలనం చేసి ప్రారంభించారు. అనంతరం కరీంనగర్ సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు సుద్దాల అశోక్ తేజను హృదయపూర్వకంగా అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

అనుముల దయాకర్ వందన సమర్పణ చేసిన ఈ పురస్కార ప్రదానోత్సవంలో సంస్థ సభ్యులు బొమ్మకంటి కిషన్, చిందం సునిత, నీలగిరి అనిత, గుండు రమణయ్యతో పాటు శాతవాహన లయన్స్ క్లబ్, లీడ్ ఇండియా నేషనల్ క్లబ్ సభ్యులు, జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ సభ్యులు, ప్రవాసీ పేరెంట్స్ అసోసియేషన్ సభ్యులు, నగర ప్రముఖులు అనేకులు పాల్గొన్నారు.



మంగళవారం తిరుపతి ఎస్వీ బీసీ కార్యాలయంలో రచయిత ఆర్.సి.కృష్ణస్వామి రాజు రచించిన 'ధర్మో రక్షతి రక్షితః' పుస్తకం ఆవిష్కరింపబడింది. ఈ కార్యక్రమంలో ఎస్వీబీసీ చైర్మన్ శ్రీధర్ వర్మ, సహస్రావధాని మేడసాని మోహన్, ఫిలాసఫీ ప్రొఫెసర్ రఘురామ రాజు, సాహితీ ప్రియులు భూపతి రాజు, శ్రీనివాసులు రెడ్డి, కాపా మధుసూదన్, డాక్టర్ స్వరాజ్య లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఖైరతాబాద్‌లో బీఆర్ఎస్ గెలుపు ఖాయం : ఎమ్మెల్యే తలసాని



హైదరాబాద్, సెప్టెంబర్ 30: ఖైరతాబాద్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు ఖాయం అని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బుధవారం సికింద్రాబాద్ జురాస్ట్రియల్ క్లబ్‌లో బీఆర్ఎస్ పార్టీ సర్వ సభ్య సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సనత్ నగర్ నియోజకవర్గంలో దాదాపు 10 వేలకు పైగా గ్రాడ్యుయేట్ ఓట్లు ఉంటాయి. ఒక్క గ్రాడ్యుయేట్‌ను కూడా మర్చిపోకుండా ఓటరుగా నమోదు చేయించాలన్నారు. రెండు గ్రాడ్యుయేట్, ఖైరతాబాద్ ఉప ఎన్నికల పని ఉంటది. 30 రోజుల కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి ఓటు నమోదు కార్యక్రమం చేయించాలన్నారు. రెండు గ్రాడ్యుయేట్ లపై మనం ఫోకస్ పెట్టాలి. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు అలవి కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని మండి పడ్డారు.

హామీలు, సమస్యలపై ప్రశ్నిస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నోటికి అడ్డు అదుపు లేకుండా మాట్లాడుతున్నారు. కాంగ్రెస్ రెండు ఎమ్మెల్సీలు ఓసీలకు ఇచ్చారు. బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలలో అర్హులు లేరా? అని సూటిగా ప్రశ్నించారు. అసెంబ్లీలో సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామనే భయంతో బీఆర్ఎస్ సభ్యులను సస్పెండ్ చేశారు. ముఖ్యమంత్రిని ఏమైనా అడుగుతాం అంటే బూతులతో రెచ్చిపోతారు .

అసెంబ్లీలో హరీశ్ రావు ఆడుకుంటారు అని సభ ను నడుపవద్దు అని అనుకుంటున్నారని ఎద్దేవా చేశారు. సమావేశంలో పార్టీ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జి తలసాని సాయి కిరణ్ యాదవ్, మాజీ కార్పొరేటర్ లు, డివిజన్ అధ్యక్షులు, ఉద్యమకారులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# కామారెడ్డిలో వృద్ధురాలు దారుణ హత్య..

కామారెడ్డి, సెప్టెంబర్ 30:(నేటినిజం ప్రతినిధి): కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కొఠారి గల్లీ కాలనీలో వృద్ధురాలు దారుణ హత్యకు గురైన ఘటన కలకలం రేపింది. స్థానికుల సమాచారం ప్రకారం.. అనసూయ (75) ఇంట్లో ఉండగా గుర్తుతెలియని వ్యక్తి ఆమె వద్ద ఉన్న బంగారు నగలను లాక్కెళ్లేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో వృద్ధురాలు ప్రతిఘటించడంతో దుండగుడు ఆమెపై దాడి చేసి హత్య చేసినట్లు తెలుస్తోంది.

అనంతరం వృద్ధురాలి వద్ద ఉన్న నగలను తీసుకుని నిందితుడు అక్కడి నుంచి పరారైనట్లు సమాచారం. రక్తపు మడుగులో పడి ఉన్న వృద్ధురాలిని గుర్తించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల పుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నారు. వాటి ఆధారంగా నిందితుడి ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

# కణిక

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న
'బుధవారం బాద్షా' పోటీ ఫలితాలు



అడ్మిన్: రమాదేవి కులకర్ణి
8985613123

నిర్వహణ: శ్రీమతి సత్య నీలిమ
95021 56813



### సముద్రం వేడెక్కితే? నేల గుండె ఎందుకు మండుతుంది

సముద్రం ఒడిలో పుట్టిన వేడి.. ఆకాశం దారిలో ప్రయాణించి,
నేల తల్లి నుదుటిపై నిప్పురవ్వగా రాలేదా.. ఎల్ నినో!.
ప్రశాంత జలాల గుండెలో ఉష్ణం పెరిగిన క్షణాన,
ప్రపంచ వాతావరణపు తాళాలు తప్పే విపత్తు మొదలవుతుంది.
మేఘాల కళ్లలో వర్షపు కలలు కరిగిపోతుంటే,
రైతు కళ్లలో పంటల పచ్చదనం కన్నీటిగా జారుతుంది.
ఎండకు ఎండిన నేల పెదవులు చినుకుకోసం విలవిలలాడితే,ల
బావి అడుగున నీడ కూడా దాహంతో మూగబోతుంది.
ఎక్కడో కురవాల్సిన వాన.. ఎక్కడో వరదై ఉప్పొంగి,
ఎక్కడో రావాల్సిన చలి.. వేడి ఊపిరిగా మారుతుంది.
ఋతువుల గడియారం ముల్లు తప్పిన వేళ,
పక్షుల పాటల్లోనూ ప్రకృతి ఆందోళన వినిపిస్తుంది.
ఒక సముద్రపు ఉష్ణోగ్రత మార్పు.. ఎంతటి ప్రభావమో చూడు,
ఒక రైతు ఇంటి పొయ్యి నుంచి
ప్రపంచ ఆర్థిక వ్యవస్థ దాకా తాకుతుంది.
ప్రకృతిని జయించానని మనిషి గర్వించిన ప్రతి అడుగుకీ,
ప్రకృతి నిశ్శబ్దమే ఇప్పుడు ఓ హెచ్చరికగా నిలుస్తోంది.
సముద్రాన్ని కాపాడితే.. మేఘాలకు మళ్లీ మార్గం దొరుకుతుంది,
భూమిని ప్రేమిస్తే.. రేపటి తరానికి పచ్చని శ్వాస మిగులుతుంది.
ఎల్ నినో ఒక పదం కాదు.. ప్రకృతి పలికిన హెచ్చరిక,
మనిషి మారితేనే.. మళ్లీ సమతుల్యంగా నవ్వుతుంది ఈ భూమి!.
–నల్లి సాయి బాబు, తెలుగు అధ్యాపకులు

### అతలాకుతలమవుతున్న పర్యావరణం

పసిఫిక్ మహాసముద్రంలో
ఉపరితల ఉష్ణోగ్రత
అసాధారణంగా
వేడెక్కిన పర్యవసానం
మబ్బులు ముఖం చాటేసి
పుడమికి చినుకును దూరం
చేస్తున్న వైనం.
భూతలంలో ఆగమాగమవుతున్న
పర్యావరణం
వానలు కురియక,ఎండలు పెరిగి
కరువు కాటకాలు జనజీవన
వెన్ను విరుస్తున్నాయి .
కొన్ని ప్రాంతాలు అనుకోని
తీవ్ర తుఫానులు,వరదలు
విస్ఫోటనాలతో మనుషుల
బతుకులను అతలాకుతలం
చేస్తున్నాయి
ఋతు పవనాలు ముఖం
చాటేస్తున్నాయి.
ఏమిటీ విపత్కర పరిస్థితులు
పంటలు దెబ్బతిని
కుదేలవుతున్న రైతన్న
చేపల వేటలు సాగక
బేజారవుతున్న జాలరులు.
దేశదేశాల ప్రగతిని నిర్వీర్యం
చేస్తున్న ఎల్ నినో ప్రభావం
ఈ ప్రకృతిని వైపరీత్యానికి
ఎవరు అడ్డు వేయగలరు
ఏ సాంకేతికత ఆపగలదు.
–కొలచన విజయ భారతి
హైదరాబాద్

### ఇప్పటికైనా కళ్ళు తెరుద్దాం

ప్రపంచ ప్రజలువాతావరణాన్ని అస్తవ్యస్తం చేస్తుంటే
పర్యావరణం ప్రశ్నార్థకమవుతోంది
ఎల్‌నినోతో విపత్తులు కళ్ళెదురుగా నృత్యం చేస్తోంటే
ప్రజలు భయాందోళనలో మునిగితేలుతున్నారు.
సముద్ర ఉపరితల జలాలు వేడెక్కి
సముద్ర గర్భంలో ఉష్ణోగ్రతల పెరిగి
విపత్తులుగా మారి జనజీవనం అతలాకుతలం అవుతోంది
శాస్త్రవేత్తలు నయానా భయానా చెప్పినా,
పట్టించుకోనిప్రబుద్ధులం
ఋతువులు గతి తప్పినా, కాలం కన్నెర్ర చేసినా,
"ఇల్లు ఇటు కాలితే అటు" వెళ్దామనుకునే ప్రవర్తనకు నీళ్లొదిలి
నిప్పుల వానకు అడ్డుకట్టు వేసి అనర్థాలను అడ్డుకోవాలి
మండే ఇంధనాలు, విచ్చలవిడిగా పట్టణీకరణ,
హరితాన్ని అంతం చేస్తూ, కాలుష్యాన్ని పెంచుతూ,
ప్రకృతిని భావితరాలకు అందివ్వక విపత్తుల భారం మోపుతూ
భవితను మాయం చేస్తుంటే
మారుతున్న వాతావరణంతో విపరీతమైన వేడితో,
చిన్న పెద్ద చికాకుల పాలవుతున్నారు
సంక్షోభాలకు స్వాతంత్ర్యం ఇవ్వక,
ఇక్కట్లను పంచుకుంటూ
ప్రకృతిని పర్యావరణాన్ని కాపాడుకుందాం
"తాను పట్టిన కుందేలుకు మూడే కాళ్ళనకుండా"
కాలాన్ని బట్టి ప్రత్యమ్నాయ పంటలతో
వ్యవసాయం చేద్దాం
వృధాలను అరికడుతూ
భువిని పరిరక్షించుకుంటూ,
భావితరాలకు బతుకునిద్దాం.
–డా॥ బండారి సుజాత


## మంజీరా రచయితల సంఘం నలభై ఏళ్ళ మహాసభ

40 మరసం

తేది : 02 అక్టోబర్, 2026, శుక్రవారం ఉ॥ 10.00 గం॥ల నుండి
వేదిక : సురవరం ప్రతాప రెడ్డి ఆడిటోరియం, టి.గోపాల రెడ్డి వేదిక, బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్, హైదరాబాద్.

**ప్రారంభ సభ**
ఉ॥ 10.00 గం॥లకు
అధ్యక్షత : కె. రంగాచారి (మరసం అధ్యక్షులు)
ముఖ్య అతిథి : తన్నీరు హరీష్‌రావు (మాజీ మంత్రి వర్యులు, శాసన సభ డిప్యూటీ ఫ్లోర్ లీడర్)
ఆత్మీయ సందేశాలు : డా॥ నందిని సిధారెడ్డి (ప్రముఖ కవి, రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత)
దేశపతి శ్రీనివాస్ (ప్రముఖ కవి, గాయకులు, శాసన మండలి సభ్యులు)
కార్యదర్శి నివేదిక : సిద్దెంకి యాదగిరి (మరసం కార్యదర్శి)
మరసం ప్రయాణం - అనుభవాలు

**వక్తలు**
దేవిప్రసాద్ (పూర్వ అధ్యక్షులు, టిఎన్‌జీఓ ల సంఘం)
కె. విరాహత్ అలీ (రాష్ట్ర అధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం)
నాళేశ్వరం శంకరం (అధ్యక్షులు, తెలంగాణ రచయితల సంఘం)
జి. పాపయ్య (టి.జె.ఏ.సి. చైర్మన్)
జి. తిరుపతి రెడ్డి (అసోసియేషట్ అధ్యక్షులు, టిపిటిఎఫ్)
కె. అంజయ్య (ప్రముఖ పాత్రికేయులు)
అలాజ్‌పూర్ కిషన్ (ప్రముఖ కవి)
పప్పుల రాజిరెడ్డి (ప్రముఖ కవి)
ఎన్. భగవాన్ రెడ్డి (ప్రముఖ విశ్లేషకులు)
తోట అశోక్ (సీనియర్ పాత్రికేయులు)

**రెండవ సభ**
మ॥ 2.00 గం॥లకు
అంశం : సాహిత్యం - వివిధ దృక్పథాలు
అధ్యక్షత : తైదల అంజయ్య (ప్రముఖ కవి)
మహిళా దృక్పథం
వక్త : నెల్లుట్ల రమాదేవి (ప్రముఖ రచయిత్రి, సాహిత్య విమర్శకులు)
దళిత దృక్పథం
వక్త : కోయి కోటేశ్వర రావు (ప్రముఖ కవి, సాహిత్య విమర్శకులు)
ద్రావిడ దృక్పథం
వక్త : జిలుకర శ్రీనివాస్ (ప్రముఖ కవి, సాహిత్య విమర్శకులు)
సమన్వయ కర్త : అలాజ్‌పూర్ శ్రీనివాస్ (మరసం ఉపాధ్యక్షులు)

**కవి సభ**
సా॥ 4.00 గం॥లకు
నిర్వహణ : సిద్దెంకి యాదగిరి (మరసం కార్యదర్శి)
పొన్నాల బాలయ్య (ప్రముఖ కవి, మరసం)

**కవి సమ్మేళనంలో పాల్గొనే ప్రముఖ కవులు**

| | | | |
|---|---|---|---|
| ఆశారాజు | వనపట్ల సుబ్బయ్య | ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్ | యరకల యాదయ్య |
| మోత్కూరి అశోక్ కుమార్ | దాసరాజు రామారావు | గడ్డం సులోచన | ఇస్త్రారి |
| వర్కుల శివకుమార్ | పప్పుల రాజిరెడ్డి | అహోబిలం ప్రభాకర్ | వాసరచెట్ల జయంతి |
| కోట్ల వెంకటేశ్వర్ రెడ్డి | తైదల అంజయ్య | వెంకట్ యాదవ్ | సరోజా వింజామర |
| కొండపల్లి విహారిణి | పొన్నాల బాలయ్య | ధూళిపాల అరుణ | దాసరి మోహన్ |
| కందుకూరి శ్రీరాములు | సిద్దెంకి యాదగిరి | గుండం మోహన్ రెడ్డి | రూప్ కుమార్ డబ్బీకార్ |
| బెల్లంకొండ సంపత్ | వేముగంటి మురళి | ఉషారాణి | రాయారావు సూర్య ప్రకాష్ |
| వి.శంకర్ | అహ్మద్ | చెన్నరాజు | బోరెడ్డి మధుసూదన్ రెడ్డి |
| కె.అంజయ్య | చమన్ సింగ్ | గంభీరావుపేట యాదగిరి | మిమిక్రీ మధు |
| | | వి.సంతోష్ | సుదగోని శైలజ |

షేక్ బాబా, ఆకారం సత్తయ్య కళా బృందంచే సాంస్కృతిక కార్యక్రమాలు

"మానవతా భావుకత మా వస్తుశిల్పాలు జీవితపు విలువలే మా అలంకారాలు
నూతనం పనితనం ఎగురు విజయ కేతనం మంజీర రచయిత సంఘం మాది"

సాహితీ ప్రియులకు సాదర ఆహ్వానము...

- మంజీరా రచయితల సంఘం






## ఆహ్వానం

కవి సమ్మేళనం మరియు "ఓ తల్లి తీర్పు" కథల సంపుటి ఆవిష్కరణ

తేదీ: 03.10.2026
సమయం: సాయంత్రం 4 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు
వేదిక: సుందరయ్య భవన్. ప్రగతి నగర్, మిథిలా నగర్ కమాన్, హైదరాబాద్ -90

నిర్వహించువారు
సాదనాల వేంకట స్వామి నాయుడు, కన్వీనర్, అక్షర కుసుమాలు
రచయిత్రి శ్రీమతి తాడిమేటి శ్రీదేవి



## అక్షయ సాహితి సృజన కళావేదిక,

లక్షెట్టిపేట, మంచిర్యాల జిల్లా వారి

**ఆహ్వానము**




కవితా తపస్వి లేదాళ్ల రాజేశ్వరరావు
"ఓ ఏకాంత తపస్సు"
(రెండు దుఃఖాల నడిమి సంతోషం)
పుస్తకావిష్కరణ మహోత్సవం

తేది: 02.10.2026. (శుక్రవారం)
సమయం: ఉ. 10.00 గం. నుండి
వేదిక : ప్రభుత్వ ఉన్నత పాఠశాల (ప్ర.జూ. కళాశాల ప్రాంగణం), లక్షెట్టిపేట, మంచిర్యాల జిల్లా.

సభాధ్యక్షులు : నూటెంకి రవీంద్ర (అధ్యక్షులు, అక్షయ సాహితి)
ముఖ్య అతిథి, ఆవిష్కర్త : దాస్యం సేనాధిపతి (విఖ్యాత సాహితీవేత్త)
విశిష్ట అతిథి : డా. తుమ్మల దేవరావ్ (ప్రముఖ కవి, చరిత్ర పరిశోధకులు)

ఆత్మీయ అతిథులు
1. దండనాయకుల వామన్ రావు (అధ్యక్షులు, జ.సా.సం. సమితి, మంచిర్యాల)
2. కందుల తిరుపతి (గౌ.అధ్యక్షులు, అక్షయ సాహితి)

పుస్తక పరిచయం :
1. నాగవర్మ ముత్యం (ప్రముఖ కవి, ప్రధాన కార్యదర్శి, తె.ర.వే. మంచిర్యాల)
2. వినయ్ కుమార్ కొట్టె (ప్రముఖ కవి, అక్షయ సాహితి కార్యవర్గ సభ్యుడు)

సభా సమన్వయం :
1. వేనంక చక్రవర్తి (ప్రధాన కార్యదర్శి, అక్షయ సాహితి)
2. రాచకొండ శ్రీనివాస్ (సంయుక్త కార్యదర్శి, అక్షయ సాహితి)

ఆహ్వానించువారు : అక్షయ సాహితి కుటుంబం
సకాలంలో విచ్చేసి విజయవంతం చేయనున్నందుకు ధన్యవాదములు
కార్యక్రమానంతరం విందు భోజనం కలదు


Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.